ప్రజాశక్తి
మంగళవారం ఏప్రిల్ 9 2024 పేజీలు 8





విజయనగరం పార్వతీపురం మన్యం

తెలుగు లోగిళ్లలో తొలి పండగ



వసంత రుతువును వేదిక చేసుకుని కోయిలలు సుమధుర సంగీతాన్ని ఆలపిస్తే...రెమ్మలకు తొడిగిన చివురులు, పసిపాపలు పిడికిళ్లు తెరిచి నీళ్లలో ఆడుకున్నట్లు హర్షధ్వానాలు తెలియజేస్తాయి. ఆకులు రాల్చిన మోడులు కొత్త చివురుల పీతాంబరాన్ని ధరిస్తే, ప్రకృతి పచ్చటి పట్టు పరికిణీ కట్టుకుని కొత్త పెళ్లికూతురై ముస్తాబవుతుంది. ఊరి వాకిళ్లు మామిడి తోరణాలై, లోగిళ్లు నిత్య వసంతం కావాలని ఆకాంక్షిస్తాయి. విచ్చుకున్న వేపపూలు చిరుగాలికి ఊగుతుంటే పగలే వెన్నెల కురిసినట్లుంటుంది. మామిడిచెట్టుకు కాసిన పిందెలు నోరూరిస్తుంటే దాని నీడ చల్లదనాన్ని కుమ్మరిస్తుంది. షడ్రుచుల సమ్మేళనమైన ఉగాది పచ్చడిని తీర్థంగా భావించి పుచ్చుకుంటే సర్వరోగాలు, సర్వభయాలు తొలగి శుభాలు కలుగుతాయనే నమ్మకాన్ని సంప్రదాయం మనకు కలిగించింది.

ప్రజాశక్తి - విజయనగరం

'ఉగ' అంటే నక్షత్రపు నడక అని అర్థం. నక్షత్రాలు నడక ప్రారంభించిన కాలాన్నే సృష్టి ఆరంభించిన కాలంగా భావిస్తారు. అంటే 'ఆది' ఉగాదిగా మారిపోయింది. ఉగాదినే సంవత్సరాది అని పిలుచుకుంటాం. అయితే ఒకప్పుడు హేమంత రుతువుతో సంవత్సరం ప్రారంభవుతుందని కొందరు... శిశిరంతో ప్రారంభమవుతుందని మరికొందరు అభిప్రాయపడ్డారు. కానీ జ్యోతిర్వేత్త వరాహ మిహిరుడు మాత్రం ఉత్తరాయణ వసంత కాలాన్నే ఉగాదిగా పేర్కొన్నాడు. ఎందుకంటే... రుతువుల్లో మొదటిది వసంతం. మాసాల్లో మొదటిది చైత్రం. పక్షాల్లో మొదటిది శుక్ల. తిథుల్లో మొదటిది పాడ్యమి కనుకన అన్నీ కలిసిన రోజు ఉగాదిగా ఉద్ఘాటించారు. అప్పటి నుంచి వసంతంలోనే ఉగాది జరుపుకుంటున్నారు. మంగళవారం నుంచి కొత్త ఉగాది 'క్రోధి' పేరుతో ప్రవేశిస్తుంది.

ఉగాది పంచాంగ శ్రవణం

ఉగాదికి మరో విశిష్టత పంచాంగ శ్రవణం. జ్యోతిష్యం, శాస్త్రం, నిరుక్తం, చందస్సు, వ్యాకరణం వంటి అంశాలతో కూడిన పంచాంగంలో తిథి, వార, నక్షత్ర, యోగము, కరణము అనే ఐదు యోగాలుంటాయి. ఆ రోజున పంచాంగం ద్వారా తమ రాశి చక్రాలను తెలుసు కుంటారు. వ్యవసాయ దారులు కొత్తసంవత్సరం ఎంత వానలు కురుస్తాయోనని తెలుసుకుని దాన్ని బట్టి కొందరు వ్యవసాయాన్ని లెక్కకడతారు. ఈ విధంగా ఉగాది ప్రత్యేకత పలువురిని సాంప్రదాయ రీతిలో ఆకట్టుకుంటుంది. ఉగాది రోజు పంచాంగ శ్రవణం చేస్తారు. తిధి వల్ల సంపద, వారం వల్ల ఆయుష్షు, నక్షత్రం వల్ల పాపపరిహారం, యోగం వల్ల వ్యాధి నివృత్తి, కరణం వల్ల కార్యానుకూలం కలుగుతాయని పూర్వీకులు చెబుతుంటారు. పంచాంగం ద్వారా మంచి చెడులను, గ్రహబలాన్ని తెలుసుకుని తమదైనందిన కార్యక్రమాలు చేసేవారు. భవిష్యత్తును పంచాంగం తెలుపుతుందనేది కొందరి విశ్వాసం.

ఏదీ నిజమైన ఉగాది?

ఉగాదులొస్తున్నాయ్... పోతున్నాయ్. కానీ మధ్య తరగతి మనిషికీ, అట్టడుగు మనిషికీ తీరని ఆశలు ఎన్నో, ఎన్నెన్నో.... ఉగాది పచ్చడిలోని తీపి ఉన్నవాడికే దక్కుతుంది. చేదు లేని వాడికే (మిగతా.. 3లో)

మిమ్స్ కార్మికుల

అక్రమ అరెస్టులను ఖండించండి

సిఐటియు రాష్ట్ర కార్యదర్శి సుబ్బరావమ్మ



మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర కార్యదర్శి సుబ్బరావమ్మ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మిమ్స్ కార్మికుల అక్రమ అరెస్టులను ప్రజలంతా ఖండించాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ పిలుపునిచ్చారు. సోమవారం ఎల్‌బిజి భవనంలో జరిగిన సిఐటియు సమావేశంలో ఆమె మాట్లాడారు. 24 మంది సిఐటియు నాయకులపైనా, మిమ్స్ ఉద్యోగులపైనా యాజమాన్యం అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపడాన్ని సిఐటియు రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. మిమ్స్ లో పనిచేస్తున్న 350 మంది కార్మికులు 67 రోజులుగా న్యాయమైన సమస్యల పరిష్కారానికి శాంతియుతంగా ఆందోళన చేస్తున్నప్పటికీ ప్రభుత్వానికి ఏమాత్రం చలనం లేదని అన్నారు. మిమ్స్ కార్మికులపైనా, నాయకత్వం వహిస్తున్న సిఐటియు నాయకులపైనా అక్రమకేసులు పెట్టి ఇప్పటికే 24మందిని రిమాండ్‌కు పంపారని తెలిపారు. పోలీసులు మిమ్స్ యాజమాన్యానికి కొమ్ముకాస్తూ అత్యుత్సాహంతో గ్రామాలలో కార్మికులు భయ భ్రాంతులకు గురిచేయడం మాను కోవాలని హితవు పలికారు .ప్రభుత్వ ఉన్నతాధికారులు, కార్మికశాఖ అధికారులు జోక్యం చేసుకుని కార్మికులు సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకర్రావు, నాయకులు బి.రమణ, ఎ.జగన్మోహన్ పాల్గొన్నారు.

అరగంటలో కేసు నమోదు

- విజయనగరం జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి ఆదేశం
- ఎఫ్ఎస్‌టి బృందాల పనితీరుపై ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న విజయనగరం కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం

ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన సంఘటనలపై అరగంటలో కేసు నమోదు చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి ఆదేశించారు. ఫిర్యాదు అందిన వెంటనే స్పందించి, సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేయాలన్నారు. ఎట్టిపరిస్థితిలోనూ జాప్యం చేయకూడదని స్పష్టం చేశారు. వివిధ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, తాహశీల్దార్లు, ఎంపిడిఒలు, పోలీసు అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులతో కలెక్టరేట్ నుంచి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎఫ్ఎస్‌టి ల పనితీరుపై సమీక్షించారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చి (మిగతా.. 3లో)



సమావేశంలో మాట్లాడుతున్న మన్యం కలెక్టర్ నిశాంత్‌కుమార్

ఎన్నికల విధుల్లో వైఫల్యాలకు

కఠిన చర్యలు

మన్యం కలెక్టర్ నిశాంత్‌కుమార్

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

ఎన్నికల విధుల్లో వైఫల్యాలకు కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిశాంత్ కుమార్ హెచ్చరించారు. రిటర్నింగ్, నోడల్ అధికారులు, తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలతో జిల్లా కలెక్టరు కార్యాలయంలో ఎన్నికలపై సోమవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ (మిగతా.. 3లో)



ఔను! వాళ్లిద్దరూ ఒక్కటయ్యారు!
6 లో

సారిపల్లిని నట్టేట ముంచేశారు..
2 లో

నిఘా పెంచండి
• సీజర్స్‌పై దృష్టి సారించాలి : కలెక్టర్
8 లో



సారిపల్లిని నట్టేట ముంచేశారు..

- వైసిపి, టిడిపిపై గ్రామస్తుల ఆగ్రహం
- పిఎఫ్ ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్

ప్రజాశక్తి - నెల్లిమర్ల

తారకరామ తీర్థ ప్రాజెక్టు నిర్వాసిత గ్రామం సారిపల్లిని వైసిపి, టిడిపి పార్టీలు పిఎఫ్ విషయంలో నట్టేట ముంచేశాయి. ముఖ్యంగా 2004లో తారకరామ తీర్థ ప్రాజెక్టు నిర్మాణంలో సారిపల్లి భూములు మునిగి గ్రామం మాత్రమే మిగిలింది. అప్పట్లో గ్రామస్థులు సిపిఎం సహకారంతో పునరావాస ప్యాకేజీ కోసం పోరాటాలు చేసి అరెస్టులకు గురై కేసులు కూడా ఎదుర్కొన్నారు. అప్పటి నుంచి సారిపల్లి గ్రామస్థులు కాలువ డిజైన్ మార్చమని అప్పట్లో కాంగ్రెస్, టిడిపి, పార్టీలను అడిగినా ఫలితం దక్కలేదు. ఈ గ్రామంలో సుమారుగా 1450 కుటుంబాలకు 75 కోట్ల బడ్జెట్ కేటాయించి పిఎఫ్ (ప్రాజెక్టు ప్రభావిత ప్రాంతం) ప్యాకేజీ మంజూరు చేసామని సాక్షాత్తూ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు చెప్పారని కానీ ఇంత వరకూ తమకు డబ్బులు అందలేదని వాపోతున్నారు. కాగా అధికార వైసిపి మీద నమ్మకంతో సర్పంచ్ ఎన్నికల్లో ఆ పార్టీ బలపర్చిన అభ్యర్థికి అత్యధిక మెజార్టీతో గెలిపించిడమే కాకుండా ఎంపిటిసి స్థానం



ఎమ్మెల్యే, ఎంపిలను నిలదీస్తున్న గ్రామస్తులు(ఫైల్)

కూడా ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని చెబుతున్నారు. గ్రామం మొత్తం అధికార వైసిపికి అన్ని విధాలా సహకరించినప్పటికీ పిఎఫ్ విషయంలో మొండి చెయ్యి చూపారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోరాటాలు చేయడంతో కొంత మందికి పిఎఫ్ డబ్బులు చెల్లించి మరికొంత మందికి చెల్లించకపోవడంతో వ్యతిరేక ఎదురైందని దీంతో నాయకులను ప్రశ్నించేసరికి మొత్తం నిధులు ఇవ్వకుండా ఆపేశారుని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

గత టిడిపి ప్రభుత్వం కూడా పిఎఫ్ అమలు విషయంలో హడావుడిగా గత ఎన్నికల నోటిఫికేషన్ ముందు అమలు చేస్తున్నామని నోటిఫికేష్ విడుదల చేసినప్పటికీ తరువాత పట్టించుకోలేదు. ఏదేమైనా పిఎఫ్ అమలు విషయంలో అధికార వైసిపి, టిడిపిలు సారిపల్లి గ్రామాన్ని నట్టేట ముంచాయని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఇటీవల ఎంపి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు గ్రామంలోని అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసేందుకు వెళ్లడంతో వారిని గ్రామస్తులు అడ్డుకున్నారు. దీంతో శంకుస్థాపనలు చేయకుండానే నాయకులు వెనుదిరిగారు. ఈ ఏడాది ఎన్నికల ముందైనా తమకు రావాల్సిన పిఎఫ్ నిధులుపై కచ్చితమైన రాతపూర్వక హామీ ఇస్తేనే గ్రామమంతా ఓట్లు వేస్తామని చెబుతున్నారు.

బహిరంగ చర్చకు సిద్ధమా?

ప్రజాశక్తి- బాడంగి

ఇటీవల కోడూరులో టిడిపి నాయకులు విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఎమ్మెల్యే శంబంగి వెంకటచినప్పలనాయుడు మండలాన్ని అభివృద్ధి చేయలేదని చెప్పడం విడ్డూరంగా ఉందని ఆ గ్రామానికి చెందిన జెసిఎస్ కన్వీనర్ మరిపి శంకర్, ఎంపిపి సలహాదారు తెంటు మధు, వైస్ సర్పంచ్ రెడ్డి కృష్ణ అన్నారు. ఈ సందర్భంగా నాయకులు సోమవారం బాడంగి వైసిపి కార్యాలయంలో మాట్లాడారు. శంబంగి హయాంలో కోడూరు పంచాయతీలో సుమారుగా రూ.5.80కోట్లతో పనులు జరిగాయని అభివృద్ధిపై చర్చించడానికి సిద్ధమా అని ప్రశ్నించారు. రామచంద్రపురం నుండి కోడూరు, అచ్చెయ్యపేట, వీరసాగరం, రైల్వే స్టేషన్ వరకు బిటీ రోడ్లు, గ్రావెల్ రోడ్లు, సిమెంట్ రోడ్లు, గ్రామంలో తాగునీరు, రెండు సచివాలయం లు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లీనిక్ సెంటర్స్ ఇలా చాలా అభివృద్ధి చేశారని ఇవన్నీ టిడిపి నాయకులకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో వైసిపి నాయకులు తెంటు రామినాయుడు, తెర్లి శ్రీనివాసరావు, కండి సురేష్, పూడి బాలకృష్ణ, రావడ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.


వాలంటీర్ల రాజీనామా

ప్రజాశక్తి- బాడంగి

మండలంలోని ముగడ సచివాలయం పరిధిలో 20 మంది వాలంటీర్లకు గాను 18 మంది సోమవారం సెక్రటరీ సుగుణకు రాజీనామా పత్రం అందజేశారు. ఉన్న ఇద్దరు కూడా త్వరలో చేస్తారని ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అందజేయడంలో స్వచ్ఛందంగా పనిచేస్తున్న తమపై టిడిపి నాయకులు నిరాధారమైన ఆరోపణలు చేయడం ఆంటంకం కలిగించిందన్నారు. అందుకే స్వచ్ఛందంగా రాజీనామా చేశామన్నారు.

భోగాపురం: మండలంలోని గుడివాడ సచివాలయం పరిధిలోని 18 మంది వాలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శికి అందజేశారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య సంధానకర్తలుగా ఉన్న తమపై టిడిపి, జనసేన లేనిపోని ఆరోపణలు చేయడంతోనే రాజీనామా చేసినట్లు తెలిపారు. మళ్లీ రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసేందుకు తమ వంతు కృషి చేస్తామని వెల్లడించారు.

కొత్తవలస: మండలంలో 27 మంది గ్రామ వాలంటీర్లు తమ పదవులకు సోమవారం రాజీనామా చేశారు. తామంతా వైసిపి తరుపున ఎన్నికల ప్రచారం చేస్తామని చెప్పారు. వాలంటీర్లపై టిడిపి తప్పుడు ప్రచారం చేస్తోందని దీనికి ఖండనగానే తామంతా రాజీనామ చేశామని చెప్పారు.



మాట్లాడుతున్న రవికుమార్

రూ.38 కోట్ల స్త్రీనిధి రుణాలు లక్ష్యం

ప్రజాశక్తి - రామభద్రపురం

రూ.38 కోట్ల స్త్రీనిధి రుణాలు లక్ష్యంగా పంపిణీకి చర్యలు తీసుకుంటున్నామని వైకెపి ఏరియా కో ఆర్డినేటర్ రవికుమార్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది జిల్లాలో బొండపల్లి, గజపతినగరం, దత్తిరాజేరు, రామభద్రపురం, బాడంగి, మెంటాడ, బొబ్బిలి మండలాల్లో స్త్రీనిధి పథకం కింద పొదుపు సంగాల మహిళలకు రూ.38.30కోట్ల రుణాలు అందించామన్నారు. 6,465మంది మహిళలకు ఈ రుణాలు అందించి వివిధ యూనిట్లను నెలకొల్పామని తెలిపారు. స్త్రీనిధి రుణాలు కూడా శతశాతం రికవరీ అయ్యాయన్నారు. ఈ ఏడాది ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రాం కింద జీవనోపాదుల కోసం 98 మందికి రూ.25.53 కోట్లు విడుదల చేశామన్నారు. డ్వాక్రా మహిళలు ఈ రుణాలతో జీవనోపాదులు మెరుగుపరచుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో బాడంగి వైకెపి ఎపిఎం భాగ్యలక్ష్మీ, బొబ్బిలి ఎపిఎం శ్రీనివాసరావు, రామభద్రపురం ఎపిఎం రత్నప్రసాద్ పాల్గొన్నారు.

మాజీ సైనికుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి- బొబ్బిలి

మాజీ సైనికులు సంక్షేమానికి కృషి చేస్తామని మాజీ సైనిక ఉద్యోగుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు ఎం.అప్పారావు అన్నారు. పట్టణంలోని మాజీ సైనిక ఉద్యోగుల కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఇళ్ల స్థలాల సమస్యలు పరిష్కారానికి, ఇతర సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పని చేయాలని అప్పారావు పిలుపునిచ్చారు. నూతన కమిటీ ఏర్పాటుపై చర్చించారు. సమావేశంలో అధ్యక్షులు రెడ్డి దామోదర్, మాజీ సైనికులు పాల్గొన్నారు.

పేద మహిళకు రూ.44,718 విద్యుత్ బిల్

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని కొండగుంపాంలో పేద మహిళకు రూ.44,718 విద్యుత్ బిల్లు రావడం దారుణమని సిపిఐ నాయకులు మొయిద పాపారావు తెలిపారు. సోమవారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ కొండగుంపాం గ్రామానికి చెందిన పేద మహిళ పతివాడ రాములమ్మకు ఈ నెల విద్యుత్ బిల్లు రూ. 44,718 వచ్చిందని తెలిపారు. వేలల్లో విద్యుత్ బిల్లు రావడంతో బాధితురాలు లబోదిబో మంటుందన్నారు. రాములమ్మ నెల పింఛన్‌తో జీవనం సాగిస్తున్న నేపథ్యంలో వేల రూపాయల విద్యుత్ బిల్లు ఎలా కట్టగలదని ప్రశ్నించారు. కాగా విద్యుత్ బిల్లు విషయమై సచివాలయంలో తన కుమారుడు సంప్రదించగా సబ్ స్టేషన్‌కి వెళ్లి ఎఇని కలవమని చెప్పారని ఎఇని కలిసినప్పటికి లైన్ మెన్ వస్తారు చూస్తారని చెప్పి రోజులు తరబడి కార్యాలయం చుట్టూ తిప్పడం భావ్యం కాదన్నారు. ఇప్పటికైనా వేలల్లో వచ్చిన విద్యుత్ బిల్లు సరిచేసి బాధితురాలికి న్యాయం చేయాలని పాపారావు డిమాండ్ చేశారు.



అధికంగా వచ్చిన కరెంటు బిల్లు

పిట్టలదొర బెదిరింపులను నమ్మొద్దు

- టిడిపి పొలిట్ బ్యురో సభ్యులు కళా
- పలు మండలాల్లో టిడిపి నాయకుల ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి- చీపురుపల్లి


చీపురుపల్లి వైసిపిలో నలుగురు పిట్టలదొరలున్నారని ఆ పిట్టల దొరల బెదిరింపులను ఏ నాయకుడు, కార్యకర్త నమ్మొద్దని చీపురుపల్లి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు కిమిడి కళావెంకటరావు కార్యకర్తలకు, నాయకులకు సూచించారు. సోమవారం ఆయన స్థానిక నటరాజ్ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన నాయకులు, కార్యకర్తల సమీక్షా సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం రాకపోతే సంక్షేమ పథకాలు రావని చీపురుపల్లి వైసిపి నాయకులు ప్రజలను మభ్యపెడతారని అటువంటి వాటిని తిప్పికొట్టి అసలు విషయాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు. ఎటువంటి బెదిరింపులకు, అదిరింపులకు బెదరకుండా అదరకుండా ఎన్నికలలో సైనికుల్లా పనిచేయాలని కోరారు. అనంతరం మండలాల వారీగా ఆయా మండలాల పార్టీ పరిస్థితులపై కళా సమీక్షించారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు రౌతు కామునాయుడు, దన్నాన రామచంద్రుడు, పైల బలరాం, సారిపాక సురేష్, వెన్ని సన్యాసినాయుడు, తాడ్డి సన్యాసినాయుడు, రెడ్డి గోవిందబాబు, తిరుమలరాజు కిరణ్, చనుమల మహేష్, జనసేన పార్టీ నాయకుడు విసినిగిరి శ్రీనివాసరావు, బిజెపి నాయకుడు ఎస్‌వియల్ఎన్ రాజుతో పాటు నాలుగు మండలాల నాయకులు పాల్గొన్నారు.



చీపురుపల్లి: సమావేశంలో మాట్లాడుతున్న కళా వెంకటరావు

సూపర్ సిక్స్‌తో పేదల జీవితాల్లో మార్పు

బొండపల్లి: టిడిపి ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్‌తో పేదల జీవితాల్లో మార్పు రావడం తథ్యమని టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం రాత్రి మండలంలోని గరుడబిల్లి గ్రామంలో ఆయన ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి టిడిపితోనే సాధ్యమని ఇందుకోసం ఎన్నికల మ్యానిఫెస్టోలో సూపర్ సిక్స్ వంటి అద్భుత పథకాలను ప్రవేశపెట్టారని చెప్పారు. ప్రజలు అలోచించి రానున్న ఎన్నికలలో రాష్ట్ర భవిష్యత్తు కోసం చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో గజపతినగరం జనసేన నియోజకవర్గ ఇంచార్జ్ మర్రాపు సురేష్, మాజీ సర్పంచ్ తాడ్డి అప్పలనాయుడు, శనపతి శ్రీనివాసరావు, కొండపల్లి సురేష్, బైరెడ్డి సంతోష కుమార్ తదితరులు పాల్గొన్నారు.



గజపతినగరం: ఎంపి అభ్యర్థిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీనివాస్, నాయకులు

కూటమి విజయానికి కలిసికట్టుగా పనిచేయాలి

గజపతినగరం : కూటమి విజయానికి కలిసికట్టుగా పనిచేయాలని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్, ఎంపి అభ్యర్థి కలిశెట్టి అప్పల నాయుడు అన్నారు. సోమవారం స్థానిక బి.ఎస్.ఆర్ ఫంక్షన్ హాల్ లో నియోజకవర్గ కూటమి నాయకులతో ఎన్నికల ప్రణాళిక సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలలో మూడు పార్టీల కలిసి సమన్వయంతో ఓటర్ల లిస్ట్ వెరిఫికేషన్, కొత్త ఓటర్లను, ఇతర ప్రాంతాలలో నివసించే ఓటర్లను గుర్తించాలని, పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పై బూత్ ఏజెంట్‌లు ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. సామాజిక మాధ్యమాల్లో ఎంపి, ఎమ్మెల్యే అభ్యర్థుల ప్రచారం క్షేత్రస్థాయిలో తీసుకు వెళ్లడంతో పాటు భారీ బహిరంగల సభలు నిర్వహించాలని అన్నారు. న్యాయపరంగా సమస్యల పరిష్కారం కోసం న్యాయవాదులను సలహాలు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. సమావేశంలో టిడిపి నాయకులు మక్కువ శ్రీధర్, బిజెపి నాయకులు రెడ్డి పావని, జనసేన నాయకులు పడాల అరుణ, మర్రాపు సురేష్, పాల్గొన్నారు.

బిసి డిక్లరేషన్‌పై ప్రజల్లో సంతృప్తి

వంగర: టిడిపి బిసి డిక్లరేషన్‌పై ప్రజల్లో సంతృప్తి వ్యక్తమవుతోందని మాజీ మంత్రి కోండ్రు సోదరుడు, టిడిపి నాయకులు కోండ్రు జగదీష్ అన్నారు. మండలంలోని కొనంగిపాడులో సోమవారం 'జయహో బిసి' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ బిసిల సాధికారత చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. అనంతరం వైసిపికి చెందిన 15 కుటుంబాలు టిడిపిలో చేరాయి. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పిన్నింటి మోహన్‌రావు, ఉదయాన మురళీ కృష్ణారావు, పైల వెంకటరమణ, లచ్చుబుక్త కృష్ణమూర్తి, ఎలకల దుర్గబాబు, బెజ్జిపురపు త్రినాధ, బౌరోతు రాంబాబు, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలో 60 కుటుంబాలు చేరిక

బొబ్బిలి: బాడంగి మండలం వీరసాగరం గ్రామానికి చెందిన 60 వైసిపి కుటుంబాలు సోమవారం టిడిపి తీర్థం పుచ్చుకున్నాయి. వీరసాగరం గ్రామానికి చెందిన వార్డు మెంబర్ జి.త్రినాథరావు, డి.వేణు, ఎన్.సత్యవతి, ఎం.పోలినాయుడు, మరో 56 కుటుంబాలు కోటకు చేరుకుని బేబినాయన సమక్షంలో టిడిపిలో చేరారు. వీరందరికి బేబినాయన కండువాలు వేసి ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో టిడిపి విజయం ఖాయమని జోశ్యం పలికారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎం.శంకరరావు, జి.తౌడు, టి చిరంజీవిరావు, కె.అప్పలనాయుడు, పాల్గొన్నారు.

ప్రజాశక్తి
మంగళవారం 9 ఏప్రిల్ 2024

కలగానే కళాశాల?

అది దశాబ్దాల నాటి కల...పేద విద్యార్థుల చదువుల సహకారానికి సార్థకమయ్యే ఆశ... ఎందరో విద్యావంతుల అభిలాష.... మొత్తంగా ఆ ప్రాంత ప్రజానీకం ఆకాంక్ష.. రాజకీయ నాయకులకు ఎన్నికల ఎజెండా.. అదే జామి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు.. ప్రభుత్వాలు మారుతున్న కాలేజీ కల మాత్రం నెరవేరడం లేదు. కాలేజీ సాధనకు ఓ ఉద్యమం రూపుదిద్దుకున్నదంటే ఈ ప్రాంత ప్రజలకు కాలేజీ ఎంత అవసరమో చెప్పకనే చెబుతోంది. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఉద్యోగ విరమణ పొందిన ఎందరో మేధావులు, యువత ఏకమై, ఆరేళ్లుగా కాలేజీ సాధన కోసం ఉద్యమించారు. ఎందరో ప్రజాప్రతినిధులకు వినతులు అందజేశారు. పోస్టు కార్డు ఉద్యమం ద్వారా జిల్లా నలుమూలలా కాలేజీ అంశాన్ని, దాని ప్రాముఖ్యతను తెలియజేశారు. దానికి స్థానిక ప్రజల మద్దతు పెరిగింది. అదే కాలేజీ ఏర్పాటుకు కార్పస్ ఫండ్ కూడగట్టేందుకు శ్రీకారం చుట్టింది. ఇంతలోనే కాలేజీ ఏర్పాటుకు ప్రజాప్రతినిధులు చర్యలు తోడయ్యాయి. ప్రతి మండలంలో ఉన్నత పాఠశాలలను జూనియర్ కాలేజీలుగా స్థాయి పెంచుతూ ఉత్తర్వులు వెలువడ్డాయి. కానీ చివరికి కాలేజీ ఆశలు అడియాశలయ్యాయి. గత పదేళ్లుగా టిడిపి, వైసిపి ప్రభుత్వాలు నిర్లక్ష్య ధోరణి అందుకు తార్కాణం. మళ్లీ ఎన్నికల నేపథ్యంలో నేడు కాలేజీ ఏర్పాటు.. ఎన్నికల ఎజెండాగా మారింది. వివరాల్లోకి వెళితే..

- నిర్లక్ష్య ధోరణిలో అధికార, ప్రతిపక్షాలు
- కాలేజీ ఏర్పాటుకు కృషి చేసిన వారికే ఓటు
- యువత, మేధావులు హితవు

ప్రజాశక్తి - జామి

మండలంలో 25 పంచాయతీలుండగా, అందులో మెజారిటీ ప్రజానీకం వ్యవసాయాధారిత కుటుంబాలే. మండలంతో పాటు ఎస్. కోట, ఎల్. కోట, వేపాడ, గంట్యాడ మండలాల్లో అనేక గ్రామాలు మండలానికి అతి చేరువలో ఉన్నాయి. విశాఖ జిల్లా పద్మనాభ మండలంలోని కొన్ని గ్రామాలు కూడా జామి మండల కేంద్రానికి సమీపాన ఉంటాయి. ఈ నేపథ్యంలోనే పదో తరగతి తర్వాత ఇంటర్ చదువులకు విజయనగరం, ఎస్.కోట, కొత్తవలస, విశాఖ ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ఏర్పడుతోందని కాబట్టి జామిలో జూనియర్ కాలేజి వస్తే, వేలాది మంది పేద విద్యార్థులకు ప్రభుత్వ జూనియర్ కాలేజి అందుబాటులోకి వచ్చి ఉన్నత చదువులకు వీలు కలుగుతోందని చుట్టు పక్కల ప్రజలు ఆశ పడ్డారు. కానీ ప్రభుత్వాలు మాత్రం ఏళ్లుగా కాలేజీ ఏర్పాటుపై తాత్సారం చేస్తున్నాయి. దీంతో కాలేజీ ఏర్పాటుకు ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలతో పాటు యువత, మేధావులు ముందుకొచ్చి, ఉద్యమ బాట పట్టారు. అదే చొరవతో స్థానిక ప్రజాప్రతినిధులు ప్రయత్నాలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కానీ ఆ స్థాయిలో రాజకీయ నాయకులు పట్టుబట్టడం లేదన్న విమర్శలు లేకపోలేదు. ఫలితంగా ఏళ్లుగా కాలేజీ కల కలగానే మిగిలిపోయింది.

బిజెపి విధానంతో చెదిరిన కల

బిజెపి తీసుకొచ్చిన నూతన విద్యావిధానంలో భాగంగా మండలంలోని హైస్కూల్ స్థాయిని పెంచి, జూనియర్ కాలేజి ఏర్పాటు చేస్తారని చెప్పారు. మండలంలో రెండు కాలేజీలు మంజూరవుతయాని అన్నారు. కానీ ఆ తర్వాత కస్తూరిబా పాఠశాల లేని మండలంలోని హైస్కూల్‌ని మాత్రమే జూనియర్ ప్లేస్2 కాలేజిగా స్థాయిని పెంచారు. ఆ లెక్కన కేవలం ఎస్.కోట మండలంలోని ధర్మవరం హైస్కూల్ మాత్రమే స్థాయి పెరిగింది. ఇలా ప్రభుత్వ విధానాల్లో బాగంగా జూనియర్ కాలేజీలు కల నీరుగారిపోయింది. ఎన్నికల ప్రచారం ఊపొందుకున్న నేపథ్యంలో కాలేజీ ఏర్పాటు చేస్తామన్న ప్రభుత్వాలకే ప్రజలు ఓటేయ్యాలని యువత, ఉద్యోగ సంఘాలు, మేధావులు పిలుపునిస్తున్నారు.

49వ డివిజన్‌లో కోలగట్ల ప్రచారం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

నగరంలోని 49వ డివిజన్ మెయిన్ రోడ్,గొల్లవీధి నుండి ప్రారంభమైన ఇంటింటి ఎన్నికల ప్రచారంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి పాల్గొన్నారు. ఈసందర్భంగా పలువురు మహిళలు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారందరికీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి పార్టీ కండువాలను వేసి సాధారంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మన్యాల కృష్ణ మాట్లాడుతూ నగరంలోని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి నేతతంలో అభివద్ధి జరిగిందన్నారు. కార్పొరేటర్ నడిపిల్లి ఆదినారాయణ, కనుగుల రాజా మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లో సైతం మౌలిక సదుపాయాలు కల్పించి ప్రజావసరాలను తీర్చారన్నారు. గతంలో గాజులరేగ ప్రాంతంలో నీటి సమస్య అధికంగా ఉండేదని, అయితే కోలగట్ల పాలన పగ్గాలు చేపట్టిన తర్వాత తాగునీటి ఇక్కట్లను పరిష్కరించారని అన్నారు. కార్యక్రమంలో జమ్ము మధు, బొడసింగి ఈసు, జామాన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో వైఫల్యాలకు కఠిన చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికల నిర్వహణకు పూర్తి స్థాయి సంసిద్ధత ఉండాలన్నారు. వచ్చే పది రోజులు కీలకమని, ప్రతి అంశంపైనా శ్రద్ధ వహించాలని ఆయన ఆదేశించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై వచ్చే ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి రిటర్నింగ్ అధికారి స్థాయిలో చర్యలు చేపట్టాలని స్పష్టంచేశారు. ఎన్నికలకు నియమించిన ప్రతి బృందం సూక్ష్మ పరిశీలన చేయాలని, నియమావళి ఉల్లంఘనకు పాల్పడుతున్న ఉద్యోగులను కూడా గుర్తించాలని సూచించారు. జిల్లాలో ఇప్పటి వరకు నలుగురు ఉద్యోగులను విధుల నుంచి తొలగించామని తెలిపారు. ఎన్నికలలో భాగంగా నగదు, మద్యం, మాదక ద్రవ్యాలు, హింస, ప్రలోభాలు వంటి అంశాలపై దృష్టి సారించాలని ఆయన ఆదేశించారు. వీటిపై గట్టి నిఘా ఉండాలని, ఎటువంటి ఉల్లంఘనలు ఉన్నా కఠినంగా వ్యవహరించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సైతం ఆదేశాలు జారీ చేశారని గుర్తుచేశారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను విధిగా పాటించాలని ఆదేశించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. పోలీసు శాఖతో సమన్వయం చేసుకుంటూ వ్యవహరించాలని స్పష్టం చేశారు. అన్ని బృందాలకు గుర్తింపు కార్డులు జారీ చేయాలని, వాహనాలకు ఎన్నికల కమిషన్ విధుల స్టిక్కర్లు అతికించాలని చెప్పారు. ఇవిఎంల ర్యాండమైజేషన్‌లో భాగంగా ఏజెంట్లు పెన్ను, పెన్సిల్, సెల్‌ఫోన్లు తదితర సామగ్రి లోపలికి తీసుకురాకూడదని ఆయన స్పష్టం చేశారు. పోస్టల్ బ్యాలెట్ వేసే కేంద్రం చుట్టుపక్కల రాజకీయ కార్యకలాపాలు ఉండరాదని, వాటిపై దృష్టి సారించాలని సూచించారు.

12,13,15 తేదీల్లో శిక్షణ

ఎన్నికల ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు ఈ నెల 12, 13, 15 తేదీల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సీతంపేట ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి, పార్వతీపురం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి.విష్ణుచరణ్, పార్వతీపురం ఆర్‌డిఒ కె.హేమలత, పాలకొండ ఆర్‌డిఒ వి.వెంకటరమణ తమ నియోజకవర్గాలలో చేపట్టిన పనులను వివరించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్ శోభిక, ఇన్‌ఛార్జి జిల్లా రెవెన్యూ అధికారి జి.కేశవనాయుడు, ఎస్‌డిసి ఆర్‌వి సూర్యనారాయణ, పార్లమెంటు నియోజకవర్గ సహాయ రిటర్నింగ్ అధికారి కె.రామచంద్రరావు, నోడల్ అధికారులు - జిల్లా పరిశ్రమల అధికారి ఎం.వి.కరుణాకర్, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి లోచర్ల రమేష్, జిల్లా రవాణా అధికారి సి.మల్లికార్జున రెడ్డి, జిల్లా ప్రజా రవాణా అధికారి టివిఎస్ సుధాకర్, తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సౌకర్యార్థం కాల్ సెంటర్

విజయనగరం టౌన్ : నగర ప్రజల సౌకర్యార్థం నగరపాలక సంస్థ కార్యాలయంలో కాల్ సెంటర్‌ను ప్రారంభించినట్లు కమిషనర్ ఎం.ఎం. నాయుడు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థ ద్వారా పౌరులకు అందుతున్న సేవలలో లోపాలు ఉన్నట్లయితే వెంటనే కాల్ సెంటర్ 98499 06486 నెంబరుకు ఫోన్ చేసి సమస్యను తెలియపరచవచ్చని చెప్పారు. సాధ్యాసాధ్యాలు పరిశీలించి త్వరితగతిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కాలువలలో పెరిగిపోయిన చెత్తాచెదారాలు, వీధి దీపాల సమస్య, పారిశుధ్య సమస్యలు వంటి ఇతరత్రా ఇబ్బందులు ఉన్నట్లయితే కాల్ సెంటర్ నెంబర్ కు ఫోన్ చేయవచ్చని తెలిపారు.

తెలుగు లోగిళ్లలో తొలి పండగ

(మొదటి పేజీ తరువాయి)

మిగిలిపోతుంది. ఎన్నో ఉగాదుల్ని దాటుకుంటూ వచ్చినా... గూడులేని అభాగ్యులెందరో, కూడులేని అన్నార్తులెందరో. కులాలూ, మతాలూ ఇంకా కత్తులు దూస్తూనే ఉన్నాయి. మనిషిని మనిషే దోచుకునే సమాజం కొనసాగుతూనే ఉంది. మహిళలపై హత్యలు, అత్యాచారాలు, దాడులు పెరుగుతునే ఉన్నాయి. నిరుద్యోగం రోజురోజుకు తీవ్రమవుతుంది. ఉపాధి కరువై మరింత మంది రోడ్డున పడుతూనే ఉన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు కార్పొరేట్ శక్తులకు పాలకులు కారుచౌకగా అమ్మేస్తున్నారు. ధనవంతులను మరింత ధనవంతులుగానూ, పేదలను మరింత పేదలుగానూ చేస్తున్నారు. సామాన్యుల జీవన ప్రమాణాలను మరింతగా దిగజార్చుతున్నారు. పాలకుల విధానాల వల్ల పాతాళానికి నెట్టబడుతున్న సామాన్యుడు ఆ విధానాలకు వ్యతిరేకంగా నిలిచి ఉద్యమించిన నాడే సమస్యలకు నిజమైన పరిష్కారం లభిస్తుంది. అప్పుడే నిజమైన ఉగాది.

అరగంటలో కేసు నమోదు

(మొదటి పేజీ తరువాయి)

సుమారు 22 రోజులు గడిచిపోయినా, క్షేత్రస్థాయిలో యంత్రాంగం చురుగ్గా లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. కేవలం ఫిర్యాదు అందితేనే స్పందిస్తున్నారు తప్ప, తామంతట తాము పట్టుకున్న కేసులు దాదాపు లేవని అన్నారు. ఫిర్యాదు వస్తేగానీ స్పందించరా.. అంటూ నిఘా వర్గాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంతవరకు ఒక్క కేసు కూడా నమోదు చేయని బృందాలను నిలదీశారు., నిర్లిప్తతను విడిచిపెట్టాలని, పనితీరు మార్చుకోకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎఫ్‌ఎస్‌టిలకు కేవలం రెండు రోజులు మాత్రమే గడువు ఇస్తామని, అప్పటికీ కేసులు నమోదు చేయకపోతే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో విస్తతంగా కోడ్ ఉల్లంఘనలు జరుగుతున్నా, చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. రాజకీయ పార్టీల సమావేశాల్లో తాగునీరు, మజ్జిగ మినహా, ఇంకా ఏది పంచినా, భోజనాలు పెట్టినా కోడ్ ఉల్లంఘన క్రిందే వస్తుందని తెలిపారు. అనధికారికంగా జరుగుతున్న కొనుగోళ్లపైనా దృష్టి సారించాలన్నారు. అలాగని ఎవరిపైన అయినా తప్పుడు కేసులు పెట్టి వేధిస్తే సహించేది లేదని కలెక్టర్ స్పష్టం చేశారు.

జిల్లా ఎస్‌పి దీపిక మాట్లాడుతూ, జిల్లాలో నగదును సీజ్ చేసుకున్న సంఘటనలు చాలా తక్కువగా ఉన్నాయని చెప్పారు. ఇతర వాహనాలతో పాటు, బస్సులను కూడా విస్తతంగా తనిఖీ చేయాలని సూచించారు. సీజర్స్‌పై దృష్టి పెట్టాలన్నారు. అనవసరంగా ఎవరినీ వేధించవద్దని, తప్పుడు కేసులు పెట్టవద్దని ఎస్‌పి స్పష్టం చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డిఆర్‌ఓ ఎస్‌డి అనిత, సిపిఒ పి.బాలాజీ, ఎక్స్‌పెండిచర్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ సత్యప్రసాద్, జిల్లా ఆడిట్ ఆఫీసర్ అరుణకుమారి, ఎంసిసి నోడల్ ఆఫీసర్ అరుణశ్రీ, ఎలక్షన్ సూపరింటిండెంట్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

చెట్టుపైనుంచి జారిపడి ఉపసర్పంచ్ మృతి

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని కొండగంగుపూడి మాజీ ఉప సర్పంచ్ కంబాల బంగారయ్య ఆదివారం కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈనెల 16న కొండగంగుపూడి పంచాయతీ పరిధిలోని చిట్టివానిపాలెంలో చింత బొట్టలు దులిపేందుకు ఆయన చింత చెట్టు ఎక్కగా కాలుజారి కిందకు పడిపోయాడు. దీంతో ఆయన తలకి బలమైన గాయం కావడంతో వెంటనే కేజీహెచ్ తరలించారు. 22 రోజులు మృత్యువుతో పోరాడి ఆదివారం రాత్రి తుది శ్వాస విడిచారు. బంగారయ్యకు భార్య ఎర్రయమ్మ, కుమారులు పెంటయ్య, అర్జును, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుని కుటుంబానికి ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చల్లా జగన్‌తో పాటు గ్రామ పెద్దలు సంతాపం తెలిపారు.

14 కిలోల వెండి వస్తువులు స్వాధీనం

ప్రజాశక్తి-విజయనగరం కోట

నగరంలో సోమవారం కన్యకాపరమేశ్వరి ఆలయం-గంటస్తంభం మధ్య ఓ వ్యక్తి నుంచి రూ.14 కిలోల 405 గ్రాముల వెండి వస్తువులను ఎస్ఐ నరేష్ కుమార్ స్వాధీనం చేసుకున్నట్లు సిఐ బి.వెంకటరావు తెలిపారు. ఆ వెండి వస్తువులకు ఎటువంటి బిల్లులూ లేకపోవడంతో వాటిని తాహశీల్దార్ కార్యాలయానికి పంపుతున్నామని తెలిపారు. విశాఖపట్నం గాజువాకకు చెందిన అర్జున్ కుమార్ మాలి విజయనగరంలోని బంగారు షాపులకు వెండి వస్తువులను సరఫరా చేస్తుంటారని, పట్టుబడిన వెండి వస్తువులను ఎటువంటి రసీదులు చూపకపోవడంతో కేసు నమోదు చేసి, సీజ్ చేసి, తాహశీల్దారు కార్యాలయానికి సిఐ తెలిపారు. కేసును ఎస్ఐ ఎ.నరేష్ దర్యాప్తు చేస్తున్నారు.

857 కిలోల పిడిఎస్ బియ్యం స్వాధీనం

నగరంలోని పద్మావతి నగర్ - ధర్మపురి మధ్య ఒక ఆటోలో పిడిఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఒక వ్యక్తిని, ఆటోను వన్‌టౌన్ ఎస్ఐ నవీన్ పడాల్ అదుపులోకి తీసుకున్నారు. అనంతరం, వాటిని సివిల్ సప్లై డిటి వద్దకు పంపగా, కేసు నమోదు చేసినట్లు సిఐ బి.వెంకటరావు తెలిపారు. భీమిలికి చెందిన కనకాల గోవింద ఆటోలో 18 బస్తాల 857 కిలోల రైస్ ను విజయనగరం నుండి భీమిలి తరలిస్తుండగా పట్టుకున్నామని, వాటి విలువ రూ.32,566ఉంటుందని తెలిపారు. సీజ్ చేసిన ఆటో విలువ రూ. 1 లక్ష ఉంటుందని సిఐ బి.వెంకటరావు తెలిపారు. ఈ కేసును ఎస్ఐ నవీన్ పడాల్ దర్యాప్తు చేస్తున్నారన్నారు.

జొన్నవలసలో అగ్నిప్రమాదం

ప్రజాశక్తి- విజయనగరం రూరల్

విజయనగరం మండలంలోని జొన్నవలసలో ఆదివారం కంబాల చెరువు వద్ద జరిగిన అగ్నిప్రమాదంలో పశువుల శాలలు, ఎండి గడ్డి వాములు కాలి బూడదియ్యాయి. ఈ ప్రమాదంలో పతివాడ అప్పలనాయుడు, పతివాడ రాజారావు, పిల్ల పెంటమ్మలకు చెందిన పశువుల శాలలు, గడ్డివాములు పూర్తిగా కాలిపోయాయి. పశువులు కూడా గాయపడ్డాయి. సుమారు రూ.3లక్షల వరకూ ఆస్తి నష్టం ఉంటుందని అంచనా వేస్తున్నారు. కాగా ఇదే గ్రామానికి చెందిన కంది గణపతికి చెందిన ఎకరన్నర మామిడి తోట కాలిపోయినట్లు గ్రామస్తులు చెబుతున్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - భోగాపురం

మండల కేంద్రంలోని ఐస్ ఫ్యాక్టరీ సమీపంలో జరుగుతున్న పేకాట శిబిరం పై పోలీసులు ఆదివారం దాడి చేశారు. ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.24,300 స్వాధీనం చేసుకున్నారు. పేకాట ఆడుతున్నట్టు సమాచారం రావడంతో సిఐ రవికుమార్ ఆధ్వర్యంలో దాడి చేసి పట్టుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కోడి పందేలపై దాడి

ప్రజాశక్తి- వేపాడ

మండలంలోని వావిలిపాడు పంచాయతీ శివారు సంజీవ మెట్ట కల్లాల వద్ద జరుగుతున్న కోడి పందేలుపై పోలీసులు సోమవారం దాడి చేశారు. గ్రామస్తులు ఇచ్చిన సమాచారం మేరకు వల్లంపూడి ఎస్ఐ కే రాజేష్ కోడి పందాలపై దాడి చేసి రెండు కోడిపుంజులను, ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్రకృతి పరవశించే వేళ

ఆది అంతాలు లేనిది కాలం. నిరంతరంగా, నిర్విరామంగా సాగుతూనే ఉంటుంది భూభ్రమణం. 'ఇదిగో... ఇది మొదలు.. అదిగో.. అది చివర' అని చెప్పడానికి కాలానికి విభజన రేఖలు లేవు. కానీ, ఇతరత్రా ఏ జంతుజాలానికీ అవసరం లేని కాల విభజన, కాల నిర్ధారణ మనిషికి అవసరం. ఏ కాలంలో ఏం జరిగిందో, ఏ రోజున ఏం జరగాలో... మననం చేసుకోవడానికి, మార్గనిర్దేశం చూపడానికీ కాలగణన అవసరం. ప్రకృతిలో జరిగే మార్పులనే ప్రామాణికంగా తీసుకొని 'ఇది ఏడాది మొదలు' అన్న లెక్క ఆరంభమైంది. ఆ ఆరంభ సంరంభమే సంవత్సరాది. తెలుగు లోగిళ్లలో చిందాడే ఉగాది. 'శిశిరంలో వాడినా, ఓడినా వసంతం నాటికి కొంగొత్తగా చివుళ్లెత్తే చైతన్యమే జీవితం' అని చాటే ప్రకృతి పండగ ఇది.

శిశిరంలో ఆకులన్నీ రాలిపోతాయి. చూస్తుండగానే చెట్లు మోడువారిపోతాయి. కొమ్మల మధ్యలోంచి చూస్తే.. అంతా శూన్యమే కనిపిస్తుంది. చూపునిండా వెలితి మేఘాలు ఆవరిస్తాయి. కింద రాలిపడిన ఆకులు ఎండిపోయి గాలివాటుకు ఎటెటో చెల్లాచెదురైపోతాయి. అన్నాళ్లూ కళకళలాడిన చెట్టు వెలవెలాపోయినందుకు కలవరపడిపోదు. విలవిల్లాడదు. బోరుమని విలపించదు. నిరాశను కౌగలించుకోదు. నీరసాన్ని నెత్తికెత్తికోదు. రాలిన ఆకుల స్థానే కొత్త చివుళ్లను మొలకెత్తడానికి సమాయత్తమవుతుంది. ఎండలు దండిగా దండెత్తుతున్నా సరే... భూమి పొరల్లోంచి చెమ్మను నెమ్మదినెమ్మదిగా సంగ్రహించి... లేలేత చివుళ్లకు ప్రాణధారగా అందిస్తుంది. అలా అందిన శక్తిని అందుకొని లేలేత ఆకులు సరికొత్తగా పరవశిస్తాయి. జీవకళతో పరిమళిస్తాయి. మోడువారిన చెట్టు నిండా హరితవర్ణపు పతాకాల్లా ఆకులు రెపరెపలాడతాయి. గుబురు కిరీటాలను ధరించిన ధీరశిఖరంలా చెట్టు నిండుగా, కనువిందుగా కనిపిస్తుంది. అలాంటి గుబురు కొమ్మల్లో దాక్కొని దాక్కొని కోయిల కూహూ.. కూహూ రావాలు చేస్తుంది. అదొక ప్రకృతి సందోహం! గాలి సవ్వడికి గొంతును సవరించుకొని లేలేత ఆకులు సాగించే గానలహరి! అంతా అయిపోయింది అన్న చోట 'ఇంకా ఎంతో ఉంది' అని చాటి చెప్పే సందర్భం ఈ వసంతం. శూన్యం ఆవరించింది అనుకున్నప్పుడు అనంతంగా ఆశలు మోహరించే సంకేతం ఈ ఉగాది. ప్రతికూలతలు పొటమరించిన చోట అనుకూలంగా తొలకరించే ఆశావహ దృక్పథానికి అర్థవంతమైన పర్వదినం ఇది.

ఆకులు రాలిన చోట...

ఉగాది అచ్చమైన, స్వచ్ఛమైన ప్రకృతి పండగ. తొట్టతొలి కాలంలో ఇప్పుడన్ని తంతులూ తతంగాలూ లేని పల్లెవాసుల వేడుక. శిశిరమంతా చలిగాలుల వెల్లువ. చైతన్యం సుప్తావస్థలోకి ముడుచుకుపోయే వాతావరణం. పొద్దువాలగానే చలిపులి దాడి చేస్తుంటే– ఎవరి ముసుగులోకి వాళ్లు దూరిపోయి దాక్కొనే పరిస్థితి! చుట్టూ ఉన్న పరిసరాలు కూడా నిశ్శబ్దాన్ని ఆవహించి, స్తబ్దుగా కూచుంటాయి. అలాంటి వాతావరణం మాయమై– పచ్చని ఆకుల రెపరెపలతో ప్రకృతి గొంతు విప్పేది వసంతంలోనే. మామిడి గుత్తులు, వేపపూల సొగసులూ, చింతబొట్టల కణకణధ్వనులూ, చురుగ్గా వీచే చిరుగాలుల అల్లర్లూ... పరిసరాలకు పరవశం కలిగిస్తాయి. జనావళి మది మూలల్లో సంతోష సరాగాలను తట్టి తట్టి లేపుతాయి. ఆ ఆనందపు సందోహం ఆవరించటం వల్లే కోయిళ్లు గొంతెత్తుతాయి. కవులు ప్రతిస్పందించి, కవిత్వంగా ప్రతిధ్వనిస్తారు. ఆకులు రాలిన చోట.. ప్రకృతి పాడిన పాట ఇది.

సేద్యానికి శుభారంభం!

ప్రకృతిలో 'కొత్తొ'చ్చినట్టు కనిపించే సహజ సందడిని ఒక్కోచోట ఒక్కోలా జరుపుకుంటారు. మనది వ్యవసాయ ప్రధానమైన సమాజం కాబట్టి– ఇక్కడి పర్వదినంలో వ్యవసాయ సంబంధ పద్ధతులే కనిపిస్తాయి. ఉగాదిని ఒక కాలమానంగా పెట్టుకొని– వ్యవసాయ ఆరంభానికి రైతులు సన్నద్ధమవుతారు. కొత్తగా కాడినో, మేడినో తయారు చేయించటం; పలుపో, కాడితాళ్లో సిద్ధం చేయడం, పొలాల్లోకి గెత్తం తోలటం, మళ్లలో సాళు వేయడం... వంటి పనులు చేపడతారు. ఇదంతా వ్యవసాయ పనుల్లోకి ట్రాక్టర్లు రాకముందు సాగిన సంప్రదాయం. ఇప్పుడు పరిస్థితి మారింది. అయినా, వ్యవసాయ ఆరంభానికి అవసరమైన ఏదొక ప్రక్రియను చేపట్టడం ఆనవాయితీగానే ఉంది. భూమి కౌలు, తనఖా వంటి ఒప్పందాలు ఈ కొత్తామావాస్య కాలంలోనే కుదుర్చుకుంటారు.



పార్టీకొక 'ఫన్'చాంగం!

అచ్చ తెలుగు పండగగా ఉగాదికి పేరు. కొన్ని రాష్ట్రాల్లో వేర్వేరు పేర్లతో వేర్వేరు రోజుల్లో సంవత్సరాదులు ఉన్నాయి. తెలుగు వారి సంవత్సరాది ప్రతిఏటా మార్చి లేదా ఏప్రిల్ నెలలో వస్తుంది. తెలుగుదనం ఉట్టిపడే వస్త్రధారణ, వంటల తయారీ ఈ సందర్భంలో కనిపిస్తుంది. పంచాంగ శ్రవణం తప్పనిసరిగా వినిపిస్తుంది. వాతావరణ శాస్త్రం, శాటిలైట్ వ్యవస్థ ఇంతగా అభివృద్ధి చెందని కాలంలో పంచాంగమే పెద్ద భవిష్యవాణి. ఇప్పుడు పంచాంగం చెప్పే కబుర్లకు విలువ లేకుండా పోయింది. ఎన్నికలు జరుగుతున్న ఈ సందర్భంలో ఈ పంచాంగాల పరస్పర విరుద్ధ భాష్యాలను ఇంకా స్పష్టంగా చూడొచ్చు. ఏ రోటికాడ ఆ పాట అన్నట్టుగా పంచాంగకర్తలు ఏ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ భవిష్యత్తునే బ్రహ్మాండంగా చూపిస్తారు. ఈ పరిహాసాల పంచాంగాల గుట్టు ఏమిటో సామాన్యులకు కూడా తెలుసు. ఎన్నికల్లో ఏ పార్టీ భవిష్యత్తు ఏమిటో నిజంగానే తేలిపోతుంది. ఆ తేల్చేది మాత్రం పంచాంగాలూ, పంచాంగకర్తలూ కాదు; ప్రజలు. ఓటు అనే అస్త్రంతో ఎవరిని గద్దెను ఎక్కించాలో, ఎవరిని దూరంగా పెట్టాలో ప్రజలే నిర్ణయిస్తారు. పార్టీల, నాయకుల భవిష్యత్తు మాత్రమే కాదు; ఇందులోనే ప్రజల భవిష్యత్తు, రాష్ట్రం, దేశం భవిష్యత్తు కూడా ముడిపడి ఉంది.

పచ్చడిలో జీవిత పరమార్థం!

ఉగాది అనగానే గుర్తొచ్చేది షడ్రుచుల పచ్చడి. తీపి చేదు పులుపు కారం వగరు. ఇన్ని రుచులు కలగలిసిన వంటకం ఇది తప్ప ఇంకేదీ మనం చవిచూడం. పచనం లేకుండానే ప్రకృతిలో దొరికిన దినుసులను యథాతథంగా వాడడం కూడా ఇందులో ప్రత్యేకం. జీవితంలో కష్టాలూ సుఖాలూ సంతోషాలూ విషాదాలూ కలగలిసి ఉంటాయని ఈ పచ్చడి పరమార్థంగా పెద్దలు చెబుతారు. దీనిని 'జీవితం అంటే ఇంతే' అన్న వేదాంత అర్థంలో కాక– 'జీవితం అంటే ఇవి కూడా' అన్న వ్యవహారిక అర్థంలో తీసుకోవాలి. కష్టకాలంలో కొట్లాడి, పోరాడి దానిని అధిగమించాలి. దుఃఖసమయంలో దానిలో మునిగి వైరాగ్య గీతాలు పాడుకోకుండా దాన్నుంచి బయటపడే దారి కోసం అన్వేషించాలి. సుఖసంతోషాలు ఉన్నప్పుడూ అంతే! అవి శాశ్వతమూ సౌఖ్యమూ అన్నట్టు ప్రవర్తించకూడదు. జీవితమంటే శిశిరంలాంటి ప్రతికూలతతో పోరాడి.. వసంతం వంటి చైతన్యంలోకి ప్రయాణించడం. ముడుచుకున్న ముసుగులోంచి ప్రభవించి.. కొమ్మల్లోని కోయిల పాటలా ప్రవహించడం. అర్థం చేసుకుంటే– ఉగాది తాత్పర్యం ఇదే! పచ్చడి పరమార్థమూ ఇంతే!!.

పర్యావరణ హననం వద్దు

ఇప్పుడు మనం చాలా చిత్రమైన సందర్భాల్లో ఉన్నాం. చెట్లను నరుక్కుంటూ వసంతం కోసం ఎదురుచూస్తున్నాం. కాంక్రీటు అరణ్యాలు నిర్మించుకుంటూ కోకిల పాట కోసం చెవులొగ్గుతున్నాం. పర్యావరణాన్ని ధ్వంసం చేస్తూ పచ్చడిలోని ప్రకృతి పరమార్థం గురించి పరవశిస్తున్నాం. వ్యవసాయాన్ని పాడె ఎక్కిస్తూ– రైతే రాజు అని కబుర్లు చెప్పుకుంటున్నాం. ఇక్కడ మనం అంటే మనమే అని కాదు. మన మౌనాన్ని మద్దతుగా చేసుకొని– మౌలిక వనరులను, పద్ధతులను మింగేస్తున్న ఘనుల గురించే ఈ మాట. ప్రకృతి వనరులను వ్యాపార పరమార్థంగా స్వాహా చేస్తున్న శక్తులూ యుక్తులూ ఈ కాలంలో బాగా పెరిగాయి. ఫలితంగా నదులు కాలుష్యం.. చెట్టు చేమలు అదృశ్యం. పంటపొలాల్లో భవనాల నిర్మాణం.. ఎక్కిన కొమ్మనే నరుక్కుంటున్న తెలివితక్కువ వ్యవహారం. ఈ పర్యావరణ హననం మీద మనం గట్టిగా పట్టించుకోవాలి. లేకుంటే– భవిష్యత్తులో వేపచెట్టును ఇంటర్నెట్లో వెతుక్కోవల్సి ఉంటుంది. కోయిల పాటను కంప్యూటర్లోంచి వినాల్సి ఉంటుంది. రాజపూజ్యాలూ, అవమానాల లెక్కలు మనకు కాదు; మన చుట్టూ ఉన్న చెట్టూగుట్టలకు కూడా చూడాలి. వాటిని కైంకర్యం చేస్తున్న ఘనుల ఆదాయ అంతస్తులు ఎలా పెరుగుతున్నాయో లెక్కించాలి.

పంచాంగం చెప్పని భవిష్యత్తు

ఉగాది పూట మనం తెలుగు భాష గురించి ఘనంగా మాట్లాడుకుంటాం. తెలుగు సంస్కృతి గురించి గొప్పగా కీర్తించుకుంటాం. ఇది ఒక్కటే సరిపోదు ఇప్పుడు. అవసరమైన దానిని నిలబెట్టుకోవడం కోసం నిరంతరం ఆలోచించాలి. పరిష్కార మార్గాలు అన్వేషించాలి. ప్రకృతికి, మనిషికి దూరం పెరగకూడదు. ఎంత పెరిగితే అంత అనర్థం. అలాంటి అనర్థాలకు తావు లేని ప్రతిరోజూ వసంతాల ఉగాది అవుతుంది. పర్యావరణాన్ని హరించే ధోరణులు దారుణంగా పెచ్చుపెరిగితే ఉగాది కూడా శిశిరంలోని చీకటి శీతల రాత్రిలాగానే ఉంటుంది.

మనకు ఏది కావాలో ఏ పంచాంగమూ చెప్పదు. మనకు మనమే చెప్పుకోవాలి... 'ప్రకృతిని కాపాడుకుంటాం.. మంచి భవిష్యత్తును నిర్మించుకుంటాం.' అని.

- సత్యాజీ

సౌలభ్యం, ఆచరణ.. పండగల పరమార్థం

తెలుగు సంవత్సరాలు 60. వరుస క్రమం ప్రభవతో మొదలై అక్షయతో ముగుస్తుంది. ఇప్పుడు కొత్త సంవత్సరం పేరు క్రోధి. వరుస క్రమంలో 38వది. మళ్లీ 2084లో వస్తుంది. ఇప్పటివరకూ నడిచిన సంవత్సరం శోభకృత్. వచ్చే ఏడాది వచ్చేది క్రోధి. వీటిని అనుకోవడానికి తప్ప అనుకోగానే నిర్దిష్టంగా గుర్తించలేం. ఎందుకంటే సంఖ్యల్లో ఉండవు కాబట్టి. పైగా ప్రపంచంలో ఇంకెవరూ ఈ పేర్లను వాడరు కాబట్టి. సులభంగా నమోదు చేయడానికి వీలుగా క్రీస్తుశకం పద్ధతినే మనం అనుసరిస్తున్నాం. ప్రపంచం మొత్తంతో కలిసి సాగాల్సిన ఆధునిక కాలంలో మనకు సౌలభ్యం ముఖ్యం తప్ప సంప్రదాయం కాదు. స్వదేశీ, స్వరాష్ట్రం పేరుతో మనం ప్రభవ, విభవ సంవత్సరాలనే అధికారిక లెక్కల్లో నమోదు చేస్తే– మనది మాత్రమే ఒక ప్రపంచంగా మిగిలిపోతుంది. పద్ధతి ఎక్కడిది, ఎవరిది అన్నది కాదు; అది మనకు సౌలభ్యమా, కాదా అన్నది ప్రధానం. వీలైనదానిని ఎక్కడినుంచైనా స్వీకరించడం, అనుసరించడం మనం పాటిస్తున్న పద్ధతి.

పంచాంగాలు కూడా మనదేశంలోని అన్ని ప్రాంతాల్లో ఒకేలా ఉండవు. కొందరిది సూర్యమాన పద్ధతైతే, మరికొందరిది చాంద్రమాన పద్ధతి. పండగల నిర్వహణకు సంబంధించిన తిథుల గణనలో వ్యత్యాసాలూ, ఆ సందర్భంగా పంచాంగకర్తల మధ్య వాదోపవాదాలూ మనం తరచూ చూస్తూనే ఉంటాం. వీటితో సంబంధం లేకుండా ఏదొకరోజు జనం పండగలను జరుపుకుంటూనే ఉన్నారు. ఇక్కడ పదిమంది కలిసి చేసుకొనే సందడి ముఖ్యం తప్ప ఆ సందర్భంగా తలెత్తే అశాస్త్రీయ వాదాల నిర్దేశాలు కావు. తరచూ ఆచరణలో జనం దీనిని నిరూపిస్తూనే ఉన్నారు.

ఉగాది పంచాంగంలో రాజపూజ్యాలు, అవమానాలు, ఆదాయ వ్యయాలు అంటూ పేరును బట్టి– ఈ ఏడాది ఎవరికి ఎలా ఉండబోతుందో చెబుతారు. ఉపాధి, ఉద్యోగం, ఉత్పత్తి మీద ఆధారపడే ఆదాయం ఉంటుందని మనందరికీ తెలుసు. పేర్లను బట్టి పరిస్థితి అనుకుంటే– అంబానీ అప్పుడప్పుడు పేదోడు అవ్వాలి. మన పక్కింటి పార్వతీశం కనీసం ఒక్కసారన్నా కోటీశ్వరుడు అయితీరాలి. కానీ, అలా జరగదు. కాబట్టి– అదంతా ఒక తంతు. ప్రకృతి పండగ ఉగాదిని నేల నుంచి ఊహల్లోకి, చేతన నుంచి చాదస్తంలోకి మళ్లించిన తతంగం.



పంచాంగం చెబుతున్న పంచాంగకర్త

షడ్రుచుల ఉగాది.. తెలుగు సంవత్సరాది

నేటి నుంచి క్రోధి నామ సంవత్సరం

ప్రజాశక్తి - విజయనగరం

ఉగాది పూర్తిగా వ్యవసాయాధారమైన పండగ. తెలుగువారి కొత్త సంవత్సరం ఆరంభదినాన్నే ఉగాది (యుగ ఆది అంటే యుగానికి ఆది) అని పిలుస్తారు. చైత్రశుద్ధ పాఢ్యమి నాడు తెలుగువారు, కన్నడిగులకు, మరాఠీలకు కొత్త సంవత్సరం ప్రారంభ మౌతుంది. చంద్ర నామాన్ని అను సరించి వీరికి ఇప్పుడు ఉగాది. సౌరనామాన్ని అనుసరించే తమిళ, మళయాల, బెంగాలీ, పంజాబీ, అస్సామీ ప్రజలకు ఉగాది వేరొక రోజున వస్తుంది. గుజరాతీలు, మార్వాడీలు, బృహస్పతి మాసాన్ననుసరించి ఉగాది జరపుకుంటారు. కేరళలో ఉగాదిని 'విషు'పేరుతో ఎంతో ఘనంగా నిర్వహిస్తారు. ఉగాది వసంత రుతువులో వస్తుంది కనుక చెట్లన్నీ కొత్తచిగుళ్లు వేసి, కోయిల పాటలతో, కొత్తపూల పరిమళాలతో ప్రకృతి శోభాయమానంగా ఉంటుంది. చెరకు, మామిడి, చింతపండు వంటి ఉత్పత్తులు చేతికందుతాయి. అందువల్లేనే ఆ రోజున కొత్త చింతపండు, కొత్తబెల్లం, చెరుకు ముక్కలు, పచ్చిమిరప, వేపపువ్వు, ఉప్పు, అరటిపండు కలిసి షడ్రుచులు గల ఉగాది పచ్చడి చేసుకుని ఆరగిస్తారు. అంతే కాదు, ముఖ్యంగా రైతులు ఏడాది పొడవునా సాగుచేసే పంటల్లో వచ్చే లాభ నష్టాలను కూడా ఉగాది రోజున భేరీజు వేసుకుంటారు. సంవత్సర ప్రాధాన్యతను బట్టి ఆరోజున పంచాంగం చూసి, రానున్న ఏడాదిలో వర్షాల పరిస్థితి, పంటల స్థితిగతులు ఎలా ఉండబోతాయో? అన్నది తెలుసుకుంటారు. పురోహితుడు చదివే పంచాంగాన్ని అందరూ శ్రద్ధంగా వింటారు. సంవత్సరం ప్రారంభం కనుక ఈ రోజు ఏం జరిగితే సంవత్సరమంతా అదే జరుగుతుందని చాలా మంది నమ్ముతారు. నేటికీ పంచాగం ప్రకారం రైతులు నాగళి, భూమి పూజ నిర్వహించడం అనాదిగా సాగుతోంది. ఉగాది రోజు కొత్త దుస్తులు, నూతన ఆభరణాలు ధరించడానికి ఎక్కువ మంది ఇష్టపడతారు. పట్టణ ప్రాంతాల్లో వ్యాపారులూ ఉగాది పండగను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తారు. ఒకప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో కుస్తీపోటీలు, పరుగుపందాలు, బలప్రదర్శనలు, ఎడ్లబండ్ల పందాలు వంటి వినోద కార్యక్రమాలు జరిగేవి. కానీ, కార్పొరేట్ సంస్కృతి పెచ్చుమీరడంతో అటువంటి సందడి నేడు కనిపించడం లేదు. ఉగాదినాడు కవి సమ్మేళనాలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించే సంస్కృతి కొనసాగుతోంది.

మానవుడు తన మనుగడకోసం ప్రకృతిపై అనేక విజయాలు సాధించాడు. అయితే ప్రకృతితో మనిషి ఒంటరిగా పోరాడలేదు. సామూహికంగా, సమిష్టిగా పోరాడాడు. అందువల్ల ప్రకృతిపై విజయం సాధించినప్పడల్లా సంతోషాన్ని కూడా సమిష్టిగానే పంచుకున్నారు. అవే సంబరాలు, ఉత్సవాలు అయ్యాయి. ఆదిమ సమాజంలో అగ్గి కొరకరాని కొయ్య. ఎముకలు కొరికే చలి నుంచి ఆది మానవుడ్ని కాపాడింది. అడవుల్లో క్రూరమృగాలను భయపెట్టి మానవుజాతి రక్షణకు దోహదపడింది. మాంసం, దుంపలు, కూరగాయలు, గింజలు, కాల్చుకు తినడం మొదలుకుని నేడు ఆహారాన్ని నిల్వ చేసుకోవడంతోపాటు అనేక రకాలుగా ఉపయోగపడుతోంది. ఈ నేపథ్యంలో అగ్గిని కనిపెట్టడం గొప్ప విజయంగా చెప్పకోవచ్చు. అదే వ్యవసాయ సమాజంలో పంటలు వేసే తరుణం, పంటచేతికొచ్చే తరుణం సంబరాలుగా మారాయి. ఇటువంటి సందర్భంలో నిర్వహించేదే ఉగాది పండగ. ఈ ఏడాది 'కోధి' పేరుతో ఉగాది వచ్చింది.



ఉగాది వచ్చిందిలా..!

విజయనగరంకోట : ఉగాది అంటే నక్షత్రాల నడక ప్రారంభించిందని అని అర్థం. చంద్రమానం పకారం చైత్రశుద్ధ పాఢ్యమి నాడు ఉగాది వస్తుంది. ఉగాది పుట్టుకకు అనేక పౌరాణిక చారిత్రక కథలు ఉన్నాయి. చైత్రమాసం నుంచి వసంత రుతువు మొదలవుతుంది. ఈ కాలంలో చెట్లు చిగురిస్తాయి. మానవ శరీరంలో కొన్ని మార్పులు చోటుచేసుకుంటాయి. శరీరంలో చర్మంపై వచ్చు చిన్న చిన్న పొక్కులు మూలంగా పొట్టు ఊడుతుంది. వసంతంలో కొత్త చర్మం వచ్చి శరీరానికి నవ చైతన్యం తీసుకువస్తుంది. పాములు కుబుసం విడవడం, నెమలి మొదలైన పక్షుల ఈకలు రాలడం, చెట్లు చిగురించడం, వాతావరణంలో మార్పులతో మానవ బుద్ధి వికాసమవుతుందని నమ్మకం.

ఉగాది నుంచి వసంత, నవరాత్రులు ప్రారంభమై శ్రీరామనవమితో ముగుస్తుంది. ఉగాదిన వేపపువ్వు కలిపిన ఉగాది పచ్చడి సేవించడం ఆనాదిగా వస్తున్న ఆచారం. ఈ ఆచారం వెనుక ఆరోగ్య సందేశమే దాగివుంది. వేప పూత, బెల్లం, చింతపండు, నెయ్యి, మిరియాలు లవణం కలిపిన షడ్రుచుల మిశ్రమాన్ని ఉగాది పచ్చడి అంటారు. వేప, బెల్లం తినడం వల్ల శరీరం దృఢంగా ఉంటుంది. సర్వ సుఖాలు కలిగి అరిష్టాలు నాశనమవుతాయి. ఇది నిజమేనా అంటే ఉగాది నుంచి ఎండలు ముదిరి వాతావరణంలో అనేక మార్పులు చోటుచేసుకుంటాయి. ఉగాది పచ్చడి సేవించడం ద్వారా కంటిచూపు, జీర్ణశక్తి వృద్ధి చెందుతాయి. షడ్రసాత్మకమైన ఈ పచ్చడిని కష్ట సుఖ సమ్మిశ్రితమైన మానవ జీవితానికి ప్రతీకగా నిర్ణయించారు.

ఔషధ విలువల సమ్మేళనం

ప్రజాశక్తి - విజయనగరం కోట

ఔషధ విలువల సమ్మేళనమే ఉగాది పచ్చడి. వేప పువ్వు, లేతమామిడి కాయలు, పచ్చి మిర్చి, అరటిపండు, కొత్త చింతపండు, కొత్త బెల్లం, మిరియాల పొడి, ఉప్పు మిశ్రమమే ఉగాది పచ్చడి. చేదుగా, తియ్యగా, వగరుగా, ఘాటుగా, పులుపుగా, షడ్రుచుల సంగమం ఉగాది పచ్చడి. మనిషి జీవితంలో జరిగే ఒడిదుడుకులకూ, సుఖదుఃఖాలకూ దీన్ని ప్రతీకగా చెబుతుంటారు.

వేపపువ్వు చేదు అనుకుంటాం గానీ, మన ఆరోగ్యాన్ని కాపాడే అమృతం అది. ఈ పువ్వులో విటమిన్ ఎ, కాల్షియం, ప్రొటీన్లు పుష్కలంగా ఉన్నాయి. వాతం, జ్వరం దగ్గను దరిచేరనివ్వదు. వేపాకులు, వేపపువ్వు క్రిమిసంహారిణి కావడం వల్ల అమ్మవారు (పొంగు) పోసినపుడు పక్కలోనే ఉంచుతాం. వేప చిగుళ్ల నూరి మాత్రలుగా చేసి, పసుపు కలిపి మింగిస్తున్నాం. గజ్జి, కుష్టు వంటి వ్యాధుల్నీ ఇది హరిస్తుందని ఆయుర్వేదం చెప్తోంది. జీర్ణక్రియను సజావుగా నిలుపుతుంది. చర్మవ్యాధుల్ని అరికడుతుంది. మామిడిలో విటమిన్ 'సి', 'ఎ'లతో పాటు మరెన్నో పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. పేగు క్యాన్సర్ ఉన్న వారికి మంచిదని డాక్టర్లు చెబుతున్నారు. చెటమ రూపంలో పోతున్న శక్తిని ఉప్పు తిరిగి శరీరానికి అందిస్తుంది. ఎముకలకు పుష్టిని ఇస్తుంది. తీపి చక్కెర, బెల్లంలో ఉంటుంది. బెల్లం ఆరోగ్యానికి శ్రేయస్కరం. రక్తాన్ని వృద్ధి పరుస్తుంది. కాలేయాన్ని శుద్ధిచేసి కామెర్ల వ్యాధిని నివారిస్తుంది. శరీరానికి బలాన్నిస్తుంది. మిరి యాల కషాయం గురించి తెలిసిందే. అది కఫవాతాలను పోగొట్టి దగ్గు, శ్లేష రోగాలను అరికడు తుంది. చింతపండు లో విటమిన్ 'డి', 'సి' పుష్కలంగా ఉంటాయి. ఇది పైత్యాన్ని పోగొడు తుంది.



కూయవే ఓ కోయిలా...

ఉగాది దగ్గర పడుతుంటే ఉత్సాహంతో ఉరకలేస్తోంది కోయిలమ్మ. పాటలే లోకంగా పరవశిస్తోంది! ఆ ఆనందంతో ఉగాది సన్నాహాలు ఎలా ఉన్నాయో చూద్దామని బయల్దేరింది.

కొండా కోనా దాటింది. వాగూవంకా వెదికింది. చెట్టూ పుట్టా చూసింది. ఊరూవాడా గాలించింది. ఎక్కడుంది సందడని వెతుకుతూనే సాగుతోంది!

ఓ చోట పసిపాప చిరునవ్వులా విరబూసి, వేపచెట్టు కనిపించింది. కోయిల ఆ చెట్టుపై వాలి కుహూ కుహూ అని పాడబోయింది. కాపలాదారు గద్దింపు వినిపించి, ఆగిపోయింది. వేపచెట్టుకు కూడా కాపలానా!? అని ఆశ్చర్యపోతుంటే– చెట్టుకు దిగేసిన ఇనుపరేకు కనిపించింది. దానిపై 'ఈ చెట్టుపై అమెరికాది పేటెంటు. ఆకుకోసినా, పువ్వు తెంపినా తప్పదు చీకటికొట్టు.' అన్న హెచ్చరిక ఉంది.

నివ్వెరపోయిన కోయిల నింగిలోకి ఎగిరింది.

ఎంతసేపో ఎగిరెగిరి ఓ తోట గట్టున వాలింది.

అది నిండుగా పండిన చెరుకుతోట. తీపివాసన మనసును మధురం చేస్తుంటే... గొంతెత్తబోయింది. గట్టుపై విషాదం నింపుకున్న రైతు కనిపించాడు. 'తోట ఇలా తొణికిసలాడుతుంటే– నీ ముఖంలో విచారం ఎందుకన్నా?' అని అడిగింది. 'ఎందుకా? ఇది తీపి చెరకు కాదు, చేదునిచ్చే సరుకు. ధర దక్కని పంట. మా జీవితాలకు మంట.' అని చిరచిరలాడాడు రైతు.

అన్నదాతకు ఇంత ఆవేదనా? అని కలవరపడింది.

అక్కడ నిలవలేక ఎగిరిపోయింది.

ఓ వీధి చివరి పెరట్లో విరగగాచిన మామిడి కనిపించింది. అయితే, ఆ ఇంట్లోని పిల్లలు ఆ తియ్యని పుల్లని కాయలకోసం తహతహలాడడం లేదు. టెంకలేని మామిడిలో మజా ఆస్వాదిస్తున్నారు. చివుక్కుమంది మనసు. పాటను మరిచిపోయి, పైకెగిరింది.



కోనసీమలాంటి పూసపాటిరేగ తీరంలో కొబ్బరి పంట కోటి తెగుళ్లతో కునారిల్లుతూ కనిపించింది. దిగుబడీ, ధరా లేక దిగులుగా ఉంది. కొండమీద 'ధర' లేదని చింతించిన చింతపండు.. పట్టణం ప్యాకెట్లో సరికొత్తగా పలకరించింది. ఇప్పుడు రేటు ఎక్కువై సామాన్యుడికి భారమయ్యానని బాధపడింది! కోయిలమ్మ ఉత్సాహం నీరు కారిపోయింది. నీరసం ఆవరించింది. పచ్చడి దినుసులే ఇంత భారమైతే, పండగ ఇంకెంత భారమో? అనుకుంది.

ఇంతలో 'కుహూకుహూ'మని ఓ కమ్మని స్వరం వినిపించింది. ప్రాణం లేచొచ్చి, అటు చూసింది. అదో సెల్‌ఫోను కాలర్ ట్యూను! తన గొంతులా వెంటపెట్టుకున్నందుకు సంతోషించాలా? వసంతకోకిల కోసం ఎదురుచూసే జనం ఉండరని విచారించాలా?

'హ్యాపీ తెలుగు న్యూ ఇయర్, హ్యాపీ ఉగాదీ...' ఫోన్లో తన మిత్రుడికి చెబుతున్నాడు సెల్‌వాలా!

'హతవిధీ... తెలుగు సంవత్సరాదికి ఏమి దుస్థితి ఇది?!' అనుకుంటూ కొండకోనలవైపు ఎగిరిపోయింది... పాపం... కోయిలమ్మ!

- సత్యాజీ

ఔను! వాళ్లిద్దరూ ఒక్కటయ్యారు!

•పిటిఆర్ ఇంటికి వెళ్లాలని సంధ్యారాణికి ఆదేశం •పార్టీని పెంట కనుసన్నల్లో నడిపించాలని సూచన •విశాఖలో అగ్రనేతల సమక్షంలో భేటీ

ప్రజాశక్తి-సాలూరు

సాలూరు నియోజకవర్గంలో టిడిపిలో అసమ్మతి నేత పెంట తిరుపతిరావుతో ఎమ్మెల్యే అభ్యర్థి జి.సంధ్యారాణి భేటీ అసంపూర్తిగా ముగిసినట్లు తెలిసింది. విశాఖపట్నంలో ఎమ్పి అభ్యర్థి భరత్ నివాసం వద్ద సోమవారం సీనియర్ నాయకులు పెంట తిరుపతిరావు, ఎమ్మెల్యే అభ్యర్థి సంధ్యారాణి మధ్య రాజీ చర్చలు జరిగాయి. మాజీ మంత్రి సుజయ్‌కృష్ణ రంగారావు, రాష్ట్ర నాయకులు దామచర్ల సత్య, అరకు పార్లమెంటు అధ్యక్షుడు కిడారి శ్రవణ్‌కుమార్ సమక్షంలో భేటీ జరిగింది. మొదట పార్టీ అగ్రనేతలు హాజరైన సాలూరు, పాచిపెంట, మెంటాడ మండలాల పార్టీ అధ్యక్షులను ఒక్కొక్కరిని పిలిచి మాట్లాడారు. మండలాల్లో పార్టీ పరిస్థితి ఎలా ఉందని, ఎంత మెజారిటీ వస్తుందని ఆరాతీశారు.

సాలూరు మండలంలో పార్టీ పరిస్థితి బాగుందని, 5 వేల మెజారిటీ వస్తుందని టిడిపి మండల అధ్యక్షులు ఆముదాల పరమేష్ చెప్పినట్లు తెలిసింది. దీనిపై పార్టీ అగ్రనేత ఒకరు జోక్యం చేసుకుని సాలూరు మండలంలో అంత ఆశాజనకంగా పార్టీ పరిస్థితి లేదని తన వద్ద సమాచారం ఉందని చెప్పినట్లు సమాచారం. ఎమ్మెల్యే అభ్యర్థి సంధ్యారాణి మండలాల్లో నాయకులందరినీ కలుపుకుని వెళ్లాలని, మెజారిటీ చెప్పలేమని పాచిపెంట మండల అధ్యక్షుడు పిన్నింటి ప్రసాద్ బాబు, మెంటాడ


సమావేశానికి హాజరైన సంధ్యారాణి, స్థానిక నాయకులు

మండల అధ్యక్షుడు చలుమూరి వెంకటరావు చెప్పినట్లు సమాచారం. అధికారపార్టీ అభ్యర్థిని ఢీకొట్టి విజయం సాధించాలంటే దండిగా డబ్బులు ఖర్చు చేయాల్సి ఉంటుందని పట్టణ అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు చెప్పినట్లు తెలిసింది. ఇక చివరగా సీనియర్ నాయకులు పెంట తిరుపతిరావుతో సయోధ్య కోసం ఎమ్మెల్యే అభ్యర్థి సంధ్యారాణికి పార్టీ నేతలు కొన్ని సూచనలు చేశారు. మక్కువ మండల పార్టీని సీనియర్ నాయకులు పెంట తిరుపతిరావు కనుసన్నల్లో నడిపించాలని వారు సూచించగా, మండల అధ్యక్షులు గుల్ల వేణుగోపాలరావుతో చర్చించి నిర్ణయం చెబుతానని సంధ్యారాణి చెప్పినట్లు తెలుస్తోంది. సీనియర్ నాయకులు పెంట తిరుపతి ఇంటికి వెళ్ళాలని, ఆయన మార్గదర్శకత్వంలో పార్టీని నడిపించాలని పార్టీ అగ్రనేతలు సూచించగా, ఆమె సరే అన్నట్లు సమాచారం. తనతోపాటు మాజీ ఎమ్మెల్యే భంజ్ దేవ్ కూడా పెంట తిరుపతిరావు ఇంటికి రావాలని సంధ్యారాణి కోరగా ఆయన అంగీకరించారు.

ఏమైనా పెంట తిరుపతిరావుతో జరిగిన చర్చల్లో పార్టీ అగ్రనేతలు ఆశించిన స్థాయిలో పురోగతి కనిపించలేదని తెలుస్తోంది. మక్కువ మండల పార్టీని పెంట తిరుపతిరావు కనుసన్నల్లో నడిపించాలని చేసిన సూచనకు సంధ్యారాణి సానుకూలంగా స్పందించలేదనే వాదనలు వినిపిస్తున్నాయి. ఆమె వ్యవహార శైలిపై పార్టీ అగ్రనేతలు కూడా కొంత అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. పెంట తిరుపతిరావు ఇంటికి సంధ్యారాణి వెళ్ళిన తరువాత జరగబోయే పరిణామాలను బట్టి మండలంలో పార్టీ పరిస్థితి ఎలా ఉంటుందనేది తేలనుంది.

పార్వతీపురం, కురుపాం పంచాయితీ కూడా..

పార్వతీపురం మన్యం జిల్లా పరిధిలోని సాలూరుతోపాటు పార్వతీపురం, కురుపాం నియోజక వర్గాల్లోని అసమ్మతి నేతలతో కూడా సోమవారం టిడిపి అగ్రనేతలు చర్చించారు. పార్వతీపురం నియోజకవర్గానికి సంబంధించి మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీశ్, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులుతో మాట్లాడి, బుజ్జగించినట్లు తెలిసింది. విజయ్‌చంద్రకు ఎన్నికల్లో సహకారం అందించాలని సూచించినట్లు సమాచారం. కురుపాం నియోజకవర్గంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దత్తి లక్ష్మణరావుతో మాట్లాడి, ఎమ్మెల్యే అభ్యర్థి జగదీశ్వరికి సహకరించాలని సూచించినట్లు తెలిసింది.


పంచాయతీ ఇఒకు రాజీనామా పత్రాలు అందజేస్తున్న వాలంటీర్లు

39 మంది వాలంటీర్ల రాజీనామా

ప్రజాశక్తి - కురుపాం

కురుపాం మేజరు పంచాయతీ పరిధిలోని 1, 2 సచివాలయాల్లో విధులు నిర్వర్తిస్తున్న 36 మంది గ్రామ వాలంటీర్లు సోమవారం స్వచ్ఛందంగా రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా పంచాయతీ ఇఒ కె.చంద్రశేఖర్‌కు సచివాలయం వద్ద మూకుమ్మడిగా రాజీనామా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యక్తిగత కారణాల వల్ల వాలంటీర్ ఉద్యోగానికి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు.

పాచిపెంట : మిర్తివలస గ్రామానికి చెందిన ముగ్గురు వాలంటీర్లు రాజీనామా చేశారు. సోమవారం ఎంపిడిఒ కార్యాలయ సిబ్బందికి రాజీనామా పత్రాలు అందజేశారు. ఎన్నికల కోడ్ కారణంగా ఇబ్బంది పెడుతున్నారని, అందుకే వాలంటీర్ ఉద్యోగానికి రాజీనామా చేస్తున్నామని వారు తెలిపారు.

ఎల్విన్‌పేటలో చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

మండలంలోని ఎల్విన్‌పేట గ్రామంలో అరకు ఎంపి అభ్యర్థి కొత్తపల్లి గీత నిధులతో చలివేంద్రం ఏర్పాటు చేశారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీరు, మజ్జిగ అందుబాటులో ఉంచి ప్రజల దాహార్తిని తీర్చాలనే ఉద్దేశంతో చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు సోనాలి రామారావు తెలిపారు.


రోగులకు సూచనలు చేస్తున్న వైద్యులు

దళాయివలసలో ఆరోగ్య సురక్ష

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలో దళాయివలస గ్రామంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని గరుగుబిల్లి పిహెచ్‌సి వైద్యాధికారి కె.కె.సాగర్ వర్మ ఆధ్వర్యాన నిర్వహించారు. శిబిరంలో దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. ఈ సందర్భంగా వడదెబ్బ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్పెషలిస్ట్ డాక్టర్ స్నిగ్ధ, సూపర్వైజర్ చిన్నమ్మ, రవణమ్మ, ఉదయకుమారి, వైద్య సిబ్బంది, సచివాలయం సిబ్బంది, 104 సిబ్బంది దుర్గాప్రసాద్, శివ, ,ఆశా కార్యకర్తలు, పాల్గొన్నారు.

బంకించంద్రకు ఘన నివాళి

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలో సోమవారం వందేమాతరం గీతం రచయిత బంకిన్‌చంద్ర చటర్జీ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నడుకూరు, బొడ్లపాడు గ్రామాల్లో జనసేన నాయకులు ఎం.పుండరీకం, జానీ.. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో పంచాంగ శ్రవణం

గరుగుబిల్లి : ఉగాది పండుగ ముందు కొత్త అమావాస్య సందర్భంగా సోమవారం మండల పరిధిలోని గ్రామాల్లో పంచాంగ శ్రవణం నిర్వహించారు. ముందుగా గ్రామ అర్చకులు పూజా కార్యక్రమాలు నిర్వహించి, అనంతరం పంచాంగ శ్రవణ కార్యక్రమం నిర్వహించారు. ఉగాది నుంచి వచ్చే కొత్త క్రోధి నామ సంవత్సరానికి సంబంధించి రాశిఫలాలను చదివి వినిపించారు.

ప్రజలకు మెరుగైన సేవలు : డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి వీరఘట్టం

ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని డిఎంహెచ్‌ఒ బగాది జగన్నాథరావు సిబ్బందిని ఆదేశించారు. మండల కేంద్రంలోని బార్నాల వీధిలో నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యంపై ప్రజలకు విశ్వాసం పెరిగేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుతం ఎండల ప్రభావం అధికంగా ఉన్నందున ఉపాధి పనులకు వెళ్లిన కూలీలకు ఎండ తీవ్రతపై అవగాహన కల్పించడంతోపాటు ఒఆర్ఎస్ ప్యాకెట్లు కూడా అందజేయాలన్నారు. ఉదయం 11 గంటలలోపు, మధ్యాహ్నం 4:00 గంటలు తరువాత బయటకు వచ్చే విధంగా ఇటువంటి శిబిరాల ద్వారా ప్రజలకు వివరించాలని చెప్పారు. గ్రామాల్లో ఫ్రీజం 10 గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో గర్భిణులను గుర్తించి వారికి సకాలంలో వ్యాధి


సిబ్బందితో మాట్లాడుతున్న డిఎంహెచ్‌ఒ జగన్నాథరావు

నిరోధక టీకాలు పడేవిధంగా చూడాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు ఆశావర్కర్ల ద్వారా గ్రామాల్లోని ప్రజల ఆరోగ్య స్థితిగతులు తెలుసుకోవాలన్నారు. ఎండవేడిని తట్టుకునేందుకు వీలుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆయనతోపాటు స్థానిక వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి, సిబ్బంది ఉన్నారు.

ఎన్నికల సిబ్బందికి శిక్షణ

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

పార్వతీపురం తహశీల్దార్ కె.ఆనందరావు ఆధ్వర్యంలో సోమవారం విఆర్‌ఒలకు ఎన్నిక విధులపై శిక్షణ ఇచ్చారు. పిఒలకు, ఎపిఒలకు, ఒపిఒలకు ఎన్నికల విధుల ఉత్తర్వుల పంపిణీ, గ్రామ శివారులలో ఏర్పాటుచేసిన చెక్‌పోస్టులలో విధుల నిర్వహణ, వికలాంగులకు, వృద్ధులకు ఓటింగ్‌లో పాల్గొనేందుకు 12 డి ఫారాలు పంపిణీ, ఇవిఎంల నిర్వహణ గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నియోజక వర్గానికి చెందిన విఆర్‌ఒలు పాల్గొన్నారు.


పనులను పరిశీలిస్తున్న ఎపిఒ సత్యంనాయుడు

ఉపాధి పనుల పరిశీలన

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలోని రేగులపాడు, నడిమికెల్ల, తూడి, వండువ, తదితర గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి పనులను సోమవారం ఎపిఒ జి.సత్యంనాయుడు పరిశీలించారు. నిబంధనల మేరకు పనులు చేస్తే కనీస వేతనం వస్తుందని ఆయన తెలిపారు. ఆ దిశగా నిబంధనల ప్రకారం పనులు చేయాలని వేతన దారులకు సూచించారు. ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున తగు జాగ్రత్తలు పాటించాలని వేతనదారులకు సూచించారు.

ముగిసిన యాత్ర

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురంలో ఉమా సహిత కైలాసనాథ ఆలయ 41వ వార్షికోత్సవ యాత్ర ఉత్సవాలు సోమవారం రాత్రితో ముగిశాయి. ఈ యాత్రకు గుమ్మలక్ష్మీపురం, కురుపాం, జియ్యమ్మవలస, పార్వతీపురం ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చారు. ఐదు రోజులపాటు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

సంక్షేమ పథకాల ఘనత మాదే

ప్రజాశక్తి- పాచిపెంట

కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత సిఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని డిప్యూటీ సిఎం రాజన్నదొర తెలిపారు. పాచిపెంట మండల కేంద్రంలో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం చేపట్టారు. ప్రతి గడపకు వెళ్లి ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఆయన మాట్లాడుతూ అవినీతిరహితంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించి, పేదలందరికీ అండగా నిలిచామని తెలిపారు. గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నూటికి 99 శాతం అమలు చేశామని తెలిపారు. గత టిడిపి హయాంలో ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి రాష్ట్ర ప్రజలను మోసం చేశారని చెప్పారు. మళ్లీ ప్రజలను మోసం చేసేందుకు పొత్తులు, గ్యారెంటీల పేరుతో ఎన్నికల ప్రచారం చేస్తున్న చంద్రబాబును ప్రజలు తరిమికొట్టాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు


పార్వతీపురం: తనకు ఓటు వేయాలని కోరుతున్న ఎమ్మెల్యే


పాచిపెంట: డిప్యూటీ సిఎంకు స్వాగతం పలుకుతున్న కార్యకర్తలు

డోల బాబ్జి, టి గౌరీశ్వరరావు, గొట్టాపు ముత్యాల నాయుడు, వైస్ ఎంపిపిలు ఎం.నారాయణ, కె.రవీంద్ర, సర్పంచులు, ఎంపిటిసిలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి

పార్వతీపురంరూరల్ : సిఎం జగనన్న అమలు చేసిన సంక్షేమ పథకాలే మళ్లీ గెలిపిస్తాయని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. సోమవారం పార్వతీపురం మండలం పులిగుమ్మి గ్రామంలో ఆయన ఇంటింటి ఎన్నికల ప్రచారం చేశారు. చంద్రబాబు నాయుడు అధికారంలోకి వస్తే వాలంటీర్ వ్యవస్థను తీసేస్తారనడానికి ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలే ఉదాహరణ అన్నారు. చంద్రబాబుకు రానున్న ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్తారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

టిడిపి గెలుపునకు కృషి చేస్తా: గొంప

ప్రజాశక్తి- శృంగవరపుకోట

టిడిపి అధిష్టానం ఆదేశాల మేరకు నియోజకవర్గంలో ఉమ్మడి టిడిపి ఎమ్మెల్యే, ఎంపి అభ్యర్థుల గెలుపునకు కృషి చేస్తానని ఆ పార్టీ యువనేత గొంప కృష్ణ తెలిపారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో నియోజకవర్గస్థాయి నాయకులు, కార్యకర్తలతో ఆయన సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారా లోకేష్, టిడిపిలో ముఖ్య పాత్ర పోషిస్తున్న తాన సంస్థలో ముఖ్య వ్యక్తి డాక్టర్ పిల్లి రాజా ఆదేశానుసారం ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. అయినప్పటికీ నియోజకవర్గ అభివృద్ధికి కొన్ని షరతులను అధిష్టానం ముందు పెట్టామని దానికి వారు అంగీకరించారని చెప్పారు.



మాట్లాడుతున్న టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కోళ్ల లలితకుమారి

ముఖ్యంగా పోలవరం కాలు ద్వారా నీటిని విశాఖపట్నానికి అందించి రైవాడ, తాటిపూడి రిజర్వాయర్ల నీటిని పూర్తిగా రైతుల సాగునీటికి ఇవ్వాలని, 5వేల మంది యువతకు ఉద్యోగవకాసాలు కలిగే విధంగా కంపెనీలను తీసుకురావాలని, సుమారు 3వేల మంది మహిళలకు ఉపాధి కలిగేలా నిర్ణయాలు తీసుకోవాలని కోరామన్నారు. విశాఖ పార్లమెంటులో ఉన్న ఎస్.కోట నియోజకవర్గాన్ని విశాఖ జిల్లాలో కలపాలని తదితర డిమాండ్లను అంగీకరించడంతో టిడిపి గెలుపునకు కృషి చేయాలని నిర్ణయించుకున్నామని ఆయన వివరించారు.

కృష్ణ నిర్ణయంపై పలువురు కార్యకర్తల ఆగ్రహం

కృష్ణ ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేయడాన్ని వెనుక్కు తీసుకుని టిడిపి అభ్యర్థుల గెలుపునకు కృషి చేయడానికి తీసుకున్న నిర్ణయంపై పలువురు కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. లలిత కుమారి గెలుపునకు కృషి చేసేందుకు తాము సముచితంగా లేమని మరోసారి ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కొంత మంది కృష్ణను కోరారు. ఈ విషయమై కార్యకర్తలతో మరో రెండు దపాలు సమావేశం ఏర్పాటు చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

శృంగవరపుకోట: పట్టణంలోని దారు గంగమ్మ ఫంక్షన్ హాల్లో మండల పార్టీ అధ్యక్షులు జిఎస్.నాయుడు,వైస్ ఎంపిపి నానిగిరి రమణాజీ ఆధ్వర్యంలో సోమవారం



మాట్లాడుతున్న గొంప కృష్ణ

జయహోబిసి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కోళ్ల లలిత కుమారి ఎస్.కోట వైస్ ఎంపిపి ఇందుకూరి సుధారాణి మాట్లాడుతూ ఎన్నికల శంఖారావంలో భాగంగా చంద్రబాబు ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. గత 40 సంవత్సరాలుగా బిసిలు టిడిపికి అండగా ఉంటున్నారని గుర్తు చేశారు. ఎన్టిఆర్ పార్టీని బిసిల కోసం స్థాపించారని చెప్పారు. చంద్రబాబు కూడా బిసిల సంక్షేమమే ధ్యేయంగా పనిచేశారని అందుకే టిడిపికి మరోసారి పట్టం కడితే బిసిల బతుకులు బాగుంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్.కోట టిడిపి, జనసేన, బిజెపి మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో కడుబండి ప్రచారం

ప్రజాశక్తి - జామి

మండలంలోని పావాడ, జాగరం, లక్ష్మిపురం గ్రామాల్లో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు సోమవారం ఎన్నికల ప్రచారం చేశారు. ప్రతి ఇంటికీ వెళ్లి, ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. వచ్చే ఎన్నికల్లో మరో అవకాశం ఇవ్వాలని అభ్యర్థించారు. ఈ ప్రభుత్వంలో తమ కుటుంబానికి మేలు జరిగితేనే, ఓటు వేయమని కోరారు. మండలంలోని సమస్యలు పరిష్కారానికి తాను కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వైసిపి మండల కన్వీనర్ జి.రవికుమార్ ఆధ్వర్యంలో జరిగిన



తనకు ఓటు వేయాలని కోరుతున్న ఎమ్మెల్యే కడుబండి

కార్యక్రమంలో నాయకులు అల్లు అప్పలనాయుడు, ఎంపిటిసి పి. నరసింహ నాయుడు, మండలంలో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధికి మద్దతు ఇవ్వండి

ప్రజాశక్తి- బొబ్బిలి

అభివృద్ధికి ప్రజలు మద్దతు ఇవ్వాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు కోరారు. స్థానిక కోటి చెరువు గట్టు వద్ద సోమవారం ఎన్నికల ప్రచారం చేసి వాకర్స్‌ను ఓట్లు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి అధికారం చేపట్టిన తర్వాత బొబ్బిలి మున్సిపాలిటీను అభివృద్ధి చేశామన్నారు. బలిజిపేట రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేశామన్నారు. రానున్న ఎన్నికల్లో అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చిన తనకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఆయనతో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, వైసిపి పట్టణ అద్యక్షులు చోడిగంజి రమేష్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.



వాకర్స్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

11న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికలు

ప్రజాశక్తి- విజయనగరం

ఈ నెల 11న అండర్ -17 జిల్లా స్థాయి ఓపెన్ బాలికల చెస్ ఛాంపియన్ షిప్ ఎంపికలు నిర్వహించనున్నామని విజయనగరం చెస్ అసోసియేషన్ సెక్రటరీ కెవి. జ్వాలా ముఖి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రింగురోడ్డులోని ఫైర్ చెస్ స్కూల్లో నిర్వహించనున్న ఎంపిక పోటీలకు 2007 జనవరి 1 లోపు పుట్టిన వారు అర్హులన్నారు. పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు జనన ధృవీకరణ పత్రాన్ని తీసుకుని రావాలన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులను ఈ నెల 20న కృష్ణాజిల్లా గుడివాడలోని త్రివేణి స్కూల్లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు పంపిస్తామని ఈ అవకాశాన్ని క్రీడాకారులు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

పారదర్శకంగా పథకాలు

ప్రజాశక్తి- చీపురుపల్లి

వైసిపి మరోసారి అధికారంలోకి వచ్చిన వెంటనే పారదర్శకంగా సంక్షేమ పథకాలను ప్రతీ ఇంటికి అందిస్తామని మరొక్కసారి అవకాశం ఇవ్వాలని వైసిపి నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మీసాల వరహాలనాయుడు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని పేరిపి గ్రామంలో వారు పర్యటించారు. ఈ నెల 10న పేరిపి గ్రామంలో జరగనున్న ప్రచారానికి మంత్రి బొత్స సత్యన్నారాయణ, జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్‌లు పాల్గొంటారని చెప్పారు. బడుగు బలహీన వర్గాలు ఆర్థికంగా ఎదగాలన్నా, మహిళలు గౌరవం పెరగాలన్నా వైసిపి అధికారంలో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామ సర్పంచ్ కోరాడ పృథ్వి, వ్యవసాయ సలహామండలి ఛైర్మన్ కోరాడ నారాయణరావు, ఎంపిటిసి కర్ణం చిన్నంనాయుడు, లెంక రాజారావు, నియోజకవర్గం యాదవ సంఘం అధ్యక్షుడు బొంతు తిరుపతియాదవ్, సోషల్ మీడియా కన్వీనర్ మొండేటి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తే చర్యలు

ప్రజాశక్తి- బొబ్బిలి

హెల్మెట్ ధరించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని డిఎస్‌పి శ్రీనివాసరావు హెచ్చరించారు. పాతబొబ్బిలి జంక్షన్‌లో వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ దరించాలన్నారు. హెల్మెట్ ధరించకపోతే కేసులు నమోదు చేస్తామన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాలు నివారణకు సహకరించాలని కోరారు.

రేగిడి : ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తే శాఖా పరమైన చర్యలు ఉంటాయని ఎస్ఐ ఈ శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు సోమవారం ఖండ్యాం గ్రామంలో ఎన్నికలపై ప్రజలకు అవగాహన కల్పించారు. 18 ఏళ్ల దాటిన ఓటర్లు తమ ఓటు హక్కును



బొబ్బిలి: వాహనదారులకు సూచనలు చేస్తున్న డిఎస్‌పి

వినియోగించుకోవాలన్నారు. ఎన్నికల్లో రెచ్చగొట్టే విధంగా మాట్లాడినా, నియమావళి ఉల్లంఘించినా చర్యలు ఉంటాయన్నారు. ఓటే వజ్రాయుధంగా మంచి నాయకున్ని ఎన్నుకోవాలని శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని అన్నారు. ఎస్ఐతో పాటు పోలీసు సిబ్బంది శివ ఉన్నారు.

జెఎన్‌టియులో సెమినార్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జెఎన్‌టియులో ఇసిఇ విభాగం అధ్వర్యంలో 'ఐఇఇఇ' విద్యార్థి విభాగంతో కలసి ఫోటోనిక్ ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్ పేరుతో 'అతిథి ఉపన్యాసం' కార్యక్రమం సోమవారం జరిగింది. రిసోర్స్ పర్సన్ గా హాజరైన బెంగూళూరులోని ఐఐఎస్‌ఎస్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్ మాట్లాడుతూ ఫోటోనిక్ ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్ల మార్కెట్ విలువ 2022-2032 సంవత్సరం మధ్య కాలంలో సిఎజిఆర్ వద్ద 21.5శాతం పెరుగుతుందని అంచనా వేశారన్నారు. వేగవంతమైన, మరింత శక్తి సామర్థ్య పరికరాలను రూపొందించటానికి ఉపయోగించ వచ్చునని తెలిపారు. కార్యక్రమంలో జెఎన్‌టియు విసి ప్రొఫెసర్ కె.వెంకట సుబ్బయ్య, ప్రొఫెసర్ జయసుమ, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.శ్రీకుమార్, కె.బాబు, వైస్ ప్రిన్సిపాల్ ఆర్.గురునాధ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న విజయ్‌బాబు

నీటిని పొదుపుగా వాడుకోవాలి

ప్రజాశక్తి - భోగాపురం

నీటిని పొదుపుగా వాడుకోవాలని జల జీవన మిషన్ జిల్లా ఐఇసి కోఆర్డినేటర్ జి విజయ్ బాబు అన్నారు. భోగాపురం ఉన్నత పాఠశాలలో నీటి పొదుపు పై విద్యార్థులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన నీటిని పొదుపుగా ఎలా వాడుకోవాలనేది విద్యార్థులకు వివరించారు. ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గోతులను తీయించాలన్నారు. జలజీవన్ మిషన్ ప్రాజెక్ట్ ప్రతినిధులు ఎం రాఘవరావు, లక్ష్మణ్, స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ బట్టా వెంకటరమణ తదితరులు నీటి పొదుపు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుమతి, పాల్గొన్నారు.

వాటర్ బెల్‌ను పరిశీలించిన ఎంఇఒ

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని సోంపురం ఉన్నత పాఠశాలలో సోమవారం వాటర్ బెల్‌ను ఎంఇఒ పి.బాల భాస్కరరావు పరిశీలించారు. అనంతరం ఇంగ్లీష్ ఎగ్జామ్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాటశాల ప్రధానోపాధ్యాయులు బి.పి రాజు, ఉపాధ్యాయులు, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో ఉగాది వేడుకలు

ప్రజాశక్తి- బొబ్బిలి

పట్టణంలోని ఒకటో వార్డు అంగన్వాడీ కేంద్రంలో ఉగాది వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉగాది సాంప్రదాయాలపై చిన్నపిల్లలకు అవగాహన కల్పించారు. ఉగాది పచ్చడి తయారు చేసి పిల్లలకు పంపిణీ చేశారు. తెలుగు సాంప్రదాయాలను గౌరవించాలని పిల్లలను ఐసిడిఎస్ సిడిపిఒ జె.విజయలక్ష్మి కోరారు.



బిందెల నృత్యం చేస్తున్న కళాకారులు

ఘనంగా నూకాలమ్మ పండగ

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బొద్దాంలో నూకాలమ్మ తల్లి అనుపోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఊరేగింపు, బండి ప్రభలు, అంజలి రథం, మహిళా కోలాటం, పలు రకాల జానపద నాట్య ప్రదర్శనలు, భారీ మందు గుండు సామాగ్రితో కన్నుల పండువుగా జరిపించారు. అమ్మవారి ఘటాలతో వీధులలో ఊరేగింపుగా ఆలయానికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎర్ర రామలక్ష్మి, ఎంపిటిసి పిల్ల లక్ష్మి, గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నరసింహరాజుకు డాక్టరేట్

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సెంచూరియన్ విశ్వవిద్యాలయం మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం స్కాలర్ జె.వి.నరసింహరాజు ఎలక్ట్రిక్ డిస్చార్జి మెషిన్ ఉపయోగించి ఎస్ఎస్ 630 గ్రేడ్ లోహాలపై చేసిన పరిశోధనకు గాను పిహెచ్‌డి ప్రదానం చేశారు. ఐక్యూఎసి డీన్ ప్రొఫెసర్ పిఎస్వి రమణారావు పర్యవేక్షణలో ఈ పరిశోధన జరిగింది. ఈ సందర్భంగా సోమవారం ఆయనను వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతి, రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి అభినందించారు.

జగదీశ్వరికి పిహెచ్‌డి ప్రదానం

ప్రజాశక్తి- కొత్తవలస

ఆంగ్ల సాహిత్యంలో రచయిత్రి కావేరి నంబిసైన్ రాసిన నవలల పైన ఆచార్య ప్రసన్న శ్రీమార్గదర్శనంలో చేసిన అధ్యయనానికి కాటకాపల్లికి చెందిన చొక్కాకుల జగదీశ్వరి పిహెచ్‌డి తీసుకున్నారు. ఈ అవార్డును ఆంధ్ర విశ్వ కళాపరిషత్ ఉపకులపతి ఆచార్య పివిజిడి ప్రసాద రెడ్డి చేతుల మీదుగా ఆమె అందుకున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

నిఘా పెంచండి

- సీజర్స్‌పై దృష్టి సారించాలి
- జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం

ఎన్నికల సందర్భంగా అక్రమ నగదు లావాదేవీలు, రవాణా జరగకుండా నిఘా పెంచాలని వివిధ శాఖల జిల్లా అధికారులను, జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి ఆదేశించారు. సీజర్స్ పెంచి అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని సూచించారు. జిల్లా స్థాయి విజిలెన్స్, ఇఎస్ఎంఎస్ (ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్) నోడల్ ఆఫీసర్ల సమావేశాన్ని కలెక్టర్ తన ఛాంబర్‌లో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల్లో అన్ని రకాల ప్రలోభాలను అరికట్టడానికి నిఘా పెంచాలని ఆదేశించారు. నగదు, మద్యం, వివిధ రకాల పరికరాలు, వస్తువులు, వస్త్రాలు, ఆభరణాల అక్రమ రవాణాపై దృష్టిపెట్టాలని సూచించారు. అక్రమంగా తరలిస్తున్న నగదు, మద్యం, పరికరాలు, వస్తువులను సీజ్ చేయాలని ఆదేశించారు. గత ఎన్నికలతో పోలిస్తే, జిల్లాలో ఇప్పటివరకు జరిగిన సీజర్స్‌పై అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు రూ.17.84 లక్షల నగదు, 29,148 లీటర్ల మద్యం, రూ.29.35 లక్షల విలువైన డ్రగ్స్, రూ.10.38 లక్షల విలువైన లోహపరికరాలు,రూ.31.01 లక్షల విలువైన వివిధ రకాల వస్తు సామగ్రి కలిపి మొత్తం సుమారుగా రూ.1,17,32,501 విలువైన వాటిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా తనిఖీలను ముమ్మరం చేయాలని, నిఘాను విస్తతం చేయాలని ఆదేశించారు. ఆర్‌పిఎఫ్, జిఆర్‌పి సిబ్బంది కూడా అప్రమత్తం కావాలని సూచించారు. ముఖ్యంగా మద్యం విక్రయాలు, అక్రమ రవాణాపై దృష్టి పెట్టాలని సూచించారు. మద్యం విక్రయాలు పెరిగిన చోట, కారణాలను ఆరా తీయాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్స్ క్రియాశీలం కావాల్సిన అవసరం ఉందన్నారు. భారీ నగదు లావాదేవీలపై ఆదాయపు పన్ను శాఖాధికారులు దృష్టి సారించాలని సూచించారు.

సమావేశంలో జిల్లా ఎస్‌పి దీపిక, జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డిఆర్‌ఒ ఎస్‌డి అనిత, నోడల్ ఆఫీసర్లు ఎఎస్‌పి అస్మా పర్వీన్, సిపిఒ పి.బాలాజీ, ఎక్స్‌పెండిచర్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ సత్యప్రసాద్, జిల్లా ఆడిట్ ఆఫీసర్ అరుణకుమారి, జెడ్‌పి సిఇఒ కె.శ్రీధర్‌రాజా, ఎక్సైజ్ సూపరింటిండెంట్ ఎన్‌వి రమణ, ఎస్ఇబి అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ డివిజి రాజు, సిజిఎస్‌టి సూపరింటిండెంట్ ఎఎస్ఎల్ శర్మ, ఎస్‌జిఎస్‌టి సూపరింటిండెంట్ పిబి వల్లి, ఎల్‌డిఎం వైడి ప్రత్యూష, ఎఫ్ఆర్‌ఒ బి.అప్పలరాజు, ఇన్‌కమ్‌టేక్స్ అధికారి జెవి రమణ, ఎలక్షన్ సూపరింటిండెంట్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీమన్నార్ ఆలయంలో నేడు ఉగాది వేడుకలు

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు క్రోధి నామ ఉగాది వేడుకలను నగరంలోని శ్రీమన్నార్ రాజగోపాల స్వామి ఆలయంలో మంగళవారం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. సంప్రదాయబద్ధంగా జరిగే ఈ వేడుకలు ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతాయన్నారు. నాదస్వర వాదనంతో మొదలయ్యే ఈ వేడుకల్లో అన్నమాచార్య కీర్తనలు, వేదపఠనం, పంచాంగ శ్రవణం, అర్చకులకు సన్మాన కార్యక్రమం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ముందస్తు పన్నుచెల్లింపుపై 5 శాతం రిబేట్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

2024-25 ఆర్థిక సంవత్సరానికి ముందస్తు పన్ను చెల్లింపులపై ఐదు శాతం రిబేటు సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించిందని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.ఎం. నాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 30వ తేదీలోపు ముందస్తు చెల్లింపు చేసిన వారికి మాత్రమే ఐదు శాతం రిబేటు అవకాశం అమలవుతుందని తెలిపారు. పన్నులు చెల్లించడానికి వీలుగా నగరపాలక సంస్థ కార్యాలయం నందు ప్రత్యేక కౌంటర్లు, హెల్ప్ డెస్కు ఏర్పాటు చేశామన్నారు. క్యాష్ కౌంటర్లు ఉదయం 8 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు పనిచేస్తాయని తెలిపారు. మంగళవారం ఉగాది పురస్కరించుకుని సెలవు దినం నేపథ్యంలో బుధవారం నుండి పన్నులు చెల్లించుకోవచ్చని తెలిపారు. పన్ను చెల్లింపు దారులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

